తన వృత్తిని పవిత్రంగా,
గౌరవంగా భావించే వ్యక్తి
ఒక్క క్షణం కూడా సోమరిగా
ఉండలేడు.
- మహాత్మాగాంధీ

Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 189 | మంగళవారం 30 డిసెంబర్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

### మెక్సికోలో పట్టాలు తప్పిన రైలు..

## 13 మంది మృతి

**మెక్సికో సిటీ – సూర్య వాస్తవం, డిసెంబర్ 29**



మెక్సికోలో రైలు పట్టాలు తప్పిన ప్రమాదంలో 13 మంది మృతి చెందారు. మరో 24 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడినవారిలో ఐదుగురు పరిస్థితి విషమంగా ఉంది. దక్షిణ రాష్ట్రమైన ఓక్సాకాలో చివెలా, నిజాండా పట్టాల మధ్య ఈ ఇంటర్ ఓషియానిక్ రైలు ఆదివారం పట్టాలు తప్పినట్లు అధికారులు తెలిపారు. ప్రమాద సమయంలో ఈ రైలులో తొమ్మిది మంది సిబ్బంది, 241 మంది ప్రయాణీకులు ఉన్నారు.

## ఆరావళిపై ఉన్నతస్థాయి కమిటీ

### సుప్రీం ప్రతిపాదన
### గతంలో జారీ చేసిన తీర్పు నిలిపివేత

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, డిసెంబర్ 29**

ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనమైన ఆరావళి పర్వత శ్రేణులపై గతంలో (నవంబరు 20న) తాము ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సోమవారం నిలిపివేసింది. దీనిపై పునరాలోచనకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. వంద మీటర్లు అంతకుమించి ఎత్తుగలిగిన శిఖరాలను, అలాగే 500మీటర్ల పరిధిలో వుండే పర్వత సముదాయాలను మాత్రమే ఆరావళి పర్వతాలుగా గుర్తిస్తామని సుప్రీం ఆనాటి తీర్పులో పేర్కొంది. ఆ తీర్పును ప్రస్తుతం నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఆరావళి



పర్వత శిఖరాలకు సంబంధించి ప్రభుత్వం సరికొత్త నిర్వచనం ఇవ్వడంపై తీవ్రమైన ఆందోళనలు చెలరేగాయి. ముఖ్యంగా ఆరావళి పర్వత శ్రేణులు వున్న

- మిగతా 2లో..



### ఏపీ ప్రభుత్వ సలహాదారుగా మంతెన సత్యనారాయణ రాజు

- ప్రకృతి వైద్య సలహాదారుగా సత్యనారాయణ రాజు నియామకం
- ప్రభుత్వ సలహాదారుడిగా పోచంపల్లి శ్రీధర్ రావు
- రెండేళ్ల పాటు పదవుల్లో కొనసాగనున్న మంతెన, శ్రీధర్ రావు

2లో



### చెవిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పు వాయిదా

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## ఇక 28 జిల్లాలు

- కొత్తగా మార్కాపురం, పోలవరం
- మదనపల్లె కేంద్రంగా అన్నమయ్య జిల్లా
- నెల్లూరుకు గూడూరులోని మూడు మండలాలు
- కొత్త వాహనాలకు10శాతం రోడ్డు భద్రత పన్ను
- అప్పు కోసం ప్రీపెయిడ్ మీటర్లకు గ్రీన్ సిగల్

ఆమోదం తెలిపిన మంత్రివర్గం

**అమరావతి – సూర్య వాస్తవం, డిసెంబర్ 29**

రాష్ట్రంలో జిల్లాల సంఖ్య పెరగనుంది. ప్రస్తుతం ఉన్న 26 జిల్లాలకు అదనంగా రెండు జిల్లాల ఏర్పాటుకు రాష్ట్రమంత్రివర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటుచేస్తూ సోమవారం నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశ నిర్ణయాలను రెవెన్యూ, పౌరసరఫరాల, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ విలేకరులకు వివరించారు. జిల్లాల పునర్విభజనపై నవంబర్ 17న ఇచ్చిన ప్రాథమిక నోటిఫికేషన్‌పై వచ్చిన పలు అభ్యతరాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకున్నా మని చెప్పారు. రంపచోడవరం నియోజకవర్గాన్ని పోలవరం జిల్లాగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పోలవరం గ్రామాన్ని అభివృద్ధి చేసి రెవెన్యూ డివిజన్‌గా భవిష్యత్తులో ఏర్పాటు చేస్తామన్నారు. కనిగిరి, ఎర్రగొండపాలెం, గిద్దలూరును కలిపి మార్కాపురం జిల్లాగా ఏర్పాటు చేస్తామన్నారు. మదనపల్లె కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఉంటుందని తెలిపారు. రాయచోటి నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా ఏర్పాటు చేయలేమని కాబట్టి దీనిని అన్నమయ్య జిల్లాలోనే ఉంచినట్లు వివరించారు.



కొత్త జిల్లాల ఏర్పాటుకు సంబంధించిన తుది నోటిఫికేషన్‌ను ఈ నెల 31వ తేదిన విడుదల చేస్తామన్నారు. గూడూరు నియోజకవర్గంలోని గూడూరు, కోట, చిల్లకూరు మండలాలను నెల్లూరు జిల్లాలో కలుపుతున్నట్లు చెప్పారు. మిగిలిన రెండు మండలాలను తిరుపతి జిల్లాలోనే ఉంచుతున్నట్లు తెలిపారు. కొత్తగా కొనుగోలు చేసే వాహనాలకు రోడ్డు భద్రత పన్ను వసూలు చేసేందుకు ఆమోదం తెలిపింది. లైఫ్ ట్యాక్స్ చెల్లించే నగదులో 10శాతం ఈ పన్ను కింద వసూలు చేసేలా ఆర్డినెన్స్ జారీ చేసేందుకు నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రతి నెలా సుమారు 73వేల కొత్త వాహనాలు రిజిస్ట్రేషన్ అవుతాయని, ఈ పన్ను ద్వారా నెలకు రూ.22.5 కోట్లు, ఏడాదికి రూ.270 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసింది. రాజధాని అమరావతిలో వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అమలు కోసం

- మిగతా 2లో..

### కేసీఆర్, నేను మాట్లాడుకున్నది

## మీకెలా చెబుతాను

- మీడియా ప్రతినిధులతో రేవంత్ రెడ్డి
- ఆసుపత్రికి వెళ్లి కూడా కేసీఆర్‌ను కలిశానని గుర్తు చేసిన రేవంత్ రెడ్డి
- బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకునే పనిలో ఉందని వ్యాఖ్యలు
- సభలో ప్రతిపక్షాలకు కౌంటర్ ఇచ్చేందుకు మంత్రులు సిద్ధం కావాలని దిశానిర్దేశం

**హైదరాబాద్ – సూర్య వాస్తవం, డిసెంబర్ 29**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో తాను మాట్లాడిన విషయాలు మీకెలా చెబుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు అసెంబ్లీకి హాజరైన కేసీఆర్ కొద్ది నిమిషాల్లోనే వెళ్లిపోయారు. శాసనసభ ప్రారంభం కాగానే రేవంత్ రెడ్డి, కేసీఆర్ వద్దకు వెళ్లి కరచాలనం చేసి ఆయన క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు.



కేసీఆర్ సభలో రెండు నిమిషాలు మాత్రమే ఉన్నారు. అనంతరం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్‌ను అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిశానని తెలిపారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రతి సభ్యుడిని తాము గౌరవిస్తామని, కేసీఆర్‌ను ఈరోజే కాకుండా, ఆసుపత్రిలో ఉన్నప్పుడు కూడా కలిశానని గుర్తు చేశారు. అసెంబ్లీ నుంచి ఆయన వెంటనే ఎందుకు వెళ్లారో కేసీఆర్‌నే అడగాలని అన్నారు. మీరిద్దరు ఏం మాట్లాడు కున్నారని విలేకరులు ప్రశ్నించగా, తామిద్దరం మాట్లా డుకున్నది మీకెలా చెబుతామని బదులిచ్చారు. ప్రస్తుతం బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో ఉందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

సభలో ప్రతిపక్షాల విమర్శలకు ధీటుగా సమాధానం చెప్పేందుకు మంత్రులు సిద్ధంగా ఉండాలని సూచించారు.

జిల్లాల వారీగా మంత్రులు ఎదురుదాడికి సిద్ధం కావాలని అన్నారు. సభలో పాయింట్ ఆఫ్ ఆర్డర్‌కు ప్రాధాన్యత ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రతిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వాలని సూచించారు. జనవరి 4 వరకు సభ జరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు.



### తిరుమల చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి

- స్వాగతం పలికిన టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు
- నేడు వైకుంఠ ఏకాదశి
- కుటుంబ సమేతంగా వైకుంఠ ద్వార దర్శనం చేసుకోనున్న రేవంత్ రెడ్డి

**తిరుమల– సూర్య వాస్తవం, డిసెంబర్ 29**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం తిరుమల క్షేత్రానికి చేరుకున్నారు. ఆయనకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌ను ఛైర్మన్ శాలువాతో సత్కరించి, శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు.

- మిగతా 2లో..

# ఆరావళిపై ఉన్నతస్థాయి కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, హర్యానా, ఢిల్లీల్లో ప్రజాందోళనలు పెల్లుబికాయి. ప్రభుత్వం తీసుకున్న చర్య వల్ల పర్వతాల్లో అక్రమ మైనింగ్ పెచ్చరిల్లుతుందని పర్యావరణవేత్తలు, సామాజిక కార్యకర్తలు ఆందోళన తెలిపారు. థార్ ఎడారి తూర్పు దిశగా విస్తరించకుండా గ్రీన్ బారియర్‌గా ఈ పర్వతాలు నిలిచాయి. అలాగే ఢిల్లీ సహా పలు నగరాల్లో కాలుష్యం మరింత విస్తరించకుండా అడ్డుకుంటున్నాయి.

ప్రభుత్వం తీసుకువచ్చిన నిర్వచనాన్ని సుప్రీం కూడా నవంబరు 20న సమర్ధించింది. రాజస్థాన్‌లో మొత్తంగా 12,081 పర్వత శిఖరాలు వుండగా, అందులో వంద మీటర్ల ఎత్తు ఉన్నవే శిఖరాలుగా ఆ నిర్వచనం తెలిపింది. అయితే వంద మీటర్లలోపు ఉన్నవి కేవలం 1048 పర్వతాలు మాత్రమే వున్నాయి. ఈ నేపథ్యంలో తక్కువ ఎత్తుగల పర్వతాలన్నీ ధ్వంసమై పోతాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీం త్రిసభ్య ధర్మాసనం ఈ ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని విచారించి, తాజా ఆదేశాలు వెలువరించింది. సంబంధిత అంశాలను శాస్త్రీయంగా నిర్ధారించాల్సి వుందని అభిప్రాయపడింది. ప్రభుత్వ కమిటీ గతంలో ఇచ్చిన నివేదికపై పున:పరిశీలనకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు బెంచ్ స్పష్టం చేసింది. ప్రభుత్వ కమిటీ ఇచ్చిన సిఫార్సుల వల్ల కలిగే స్వల్పకాల, దీర్ఘకాల పర్యావరణ ప్రభావాలను పరిశీలించాల్సి వుందని పేర్కొంది. శాస్త్రీయంగా, భౌగోళికంగా అంచనాలన్నింటినీ కూలంకషంగా పరిశీలించి, సమీక్షించిన అనంతరమే ఆరావళి పర్వత శ్రేణి నిర్వచనంపై ఒక అంచనాకు వస్తామని కోర్టు తెలిపింది.

సుప్రీం ఇచ్చిన తాజా తీర్పు ఈ ప్రాంతంలో తాజాగా మైనింగ్ లీజులు జారీ చేయడాన్ని ఆపేసింది. మరికొన్ని వివరణలు అవసరమవుతున్నాయి, స్వతంత్ర నిపుణుల అభిప్రాయాలను తీసుకోవాల్సి వుంది, అన్ని పక్షాలతో చర్చలు జరిపిన తర్వాత వాటిని పరిశీలించాల్సి వుంది. ఇందులోని అస్పష్టతలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా వుంది, అలాగే నిర్దిష్టమైన మార్గదర్శకాలు కూడా అందించాల్సి వుందని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ కేంద్రం తరపున వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు చెప్పారు. పర్యావరణపరమైన అంశాలపై రాజీపడకుండా ఆరావళి పర్వతాలను నిర్వచించేందుకు నిర్దిష్ట, ప్రత్యేక ప్రామాణికాలు రూపొందించాల్సిన ఆవశ్యకత వుందని బెంచ్ పేర్కొంది. దీనిపై తదుపరి విచారణను జనవరి 21వ తేదీకి వాయిదా వేశారు.

# ఇక 28 జిల్లాలు

(మొదటిపేజీ తరువాయి)

నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డు) నుంచి నాబార్డు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ అసిస్టెన్స్ (ఎన్ఐడిఎ) స్కీం కింద రూ.7387.70 కోట్ల అప్పు పొందేందుకు సిఆర్‌డిఎ కమిషనర్‌కు అనుమతి ఇచ్చింది. జిఎస్‌డిపిలో 0.50శాతం వరకు అదనపు రుణాన్ని పొందేందుకు అన్ని ప్రభుత్వ భవనాల్లో స్మార్ట్ ప్రిపెయిడ్ మీటర్లను అమర్చనుంది. ఎపి పవర్ కోఆర్డినేషన్ కమిటీ (ఎపిపిసిసి) సభ్యుల కన్వీనర్ చేసిన ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

**స్వర్ణ సచివాలయాలు**

గ్రామ, వార్డు సచివాలయాల పేర్లను స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాలుగా మార్పు చేయాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. ఇ- కోర్టు ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని 13 జిల్లా కోర్టుల్లో 13 సిస్టమ్ ఆఫీసర్ పోస్టులు, 26 సిస్టమ్ అసిస్టెంట్ పోస్టుల కల్పనకు ఆమోదం తెలపడంతో పాటు ప్రస్తుతం కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న సిబ్బందిని ఈ కొత్త పోస్టుల్లో విలీనం చేసే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు 2024 జనవరి 1 నుంచి 3.64శాతం డిఎ, డిఆర్ పెంపు అమలు చేస్తూ, 2025 అక్టోబర్ జీతం నుంచి ప్రయోజనం అందించేందుకు ఆమోదం తెలిపింది. ఎన్ఎస్ఎఫ్‌డిసి, ఎన్ఎస్‌కెఎఫ్‌డిసి సహకారంతో రుణం తీసుకున్న ఎస్‌సి లబ్ధిదారులకు రూ.41.61 కోట్ల బకాయి వడ్డీని 4 నెలల వ్యవధి చెల్లించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. అమరావతి రాజధానిలో అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణానికి రూపకల్పన, నిర్మాణ విధానంలో టెండర్ మంజూరు చేసే ఈ ప్రాజెక్టుకు రూ.137 కోట్ల పరిపాలనా ఆమోదం ఇచ్చింది. దీనిని టూబ్రో సంస్థకు కాంట్రాక్టు కేటాయించేందుకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ చేసిన ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఉండవల్లి వద్ద ఫ్లడ్ పంపింగ్ స్టేషన్-2కు 15 ఏళ్ల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనిని ఎల్ 1 బిడ్‌ను ఆమోదించేందుకు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అధికారం ఇచ్చింది. మంగళగిరి %-% తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లో వికేంద్రీకరణ అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్, మురుగునీటి శుద్ధి కేంద్ర నిర్మాణానికి పురపాలక పట్టణాభివృద్ధి శాఖ చేసిన ప్రతిపాదనకు ఆమోదం. ఈ ప్రాజెక్టులను హైబ్రిడ్ అన్యూటీ మోడల్ కింద రెండు దశల్లో అమలు చేయనున్నారు. తిరుపతిలో లగ్జరీ హోటల్‌కు కేటాయించిన ఐదెకరాల ప్రభుత్వ భూమి లీజును రద్దు చేసింది. ఈ సమావేశంలో సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కెఎస్ విశ్వనాథన్ పాల్గొన్నారు.

**భూ కేటాయింపులు**

బాపట్ల మండలంలోని వెస్ట్ బాపట్ల గ్రామంలో రెండెకరాల ప్రభుత్వ భూమిని టిడిపి జిల్లా కార్యాలయం నిర్మాణానికి ఏడాదికి రూ.1000 చొప్పున 33 ఏళ్ల పాటు లీజుకు అప్పగించేందుకు నిర్ణయం తీసుకుంది.

విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం, గుడివాడ గ్రామంలో 18.57 ఎకరాల ప్రభుత్వ భూమిని రాష్ట్రీయ సేవా సమితికి బదిలీ చేసేందుకు ఆమోదం తెలిపింది.

అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన గ్రామం, 9.88 ఎకరాల భూమిని వేదాంత లిమిటేడ్‌కు లీజు పద్ధతిలో కేటాయింపు.

నెల్లూరు జిల్లా దామవరం గ్రామంలో 418.14 ఎకరాలను దగదర్తి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు అభివృద్ధి కోసం సేకరించేందుకు ఎపి ఎయిర్‌పోర్ట్సు డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అనుమతి ఇచ్చింది.

తిరుపతి జిల్లా దామినేడు గ్రామంలో 28.37 ఎకరాల ప్రభుత్వ భూమిని జిల్లా స్పోర్ట్స్ ఆథారిటీ తిరుపతి స్థానంలో శాప్‌కు ఉచితంగా బదిలీ చేసేందుకు ఆమోదం.

ఏలూరు జిల్లా నూజివీడులో 9.96 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్ స్థాపన కోసం హార్టికల్చర్ అండ్ సెరికల్చర్ డైరెక్టర్‌కు 33 ఏళ్లపాటు లీజు ప్రాతిపదికన బదిలీ.

# ఏపీ ప్రభుత్వ సలహాదారుగా మంతెన సత్యనారాయణ రాజు

- ప్రకృతి వైద్య సలహాదారుగా సత్యనారాయణ రాజు నియామకం
- ప్రభుత్వ సలహాదారుడిగా పోచంపల్లి శ్రీధర్ రావు
- రెండేళ్ల పాటు పదవుల్లో కొనసాగనున్న మంతెన, శ్రీధర్ రావు

**అమరావతి- సూర్య వాస్తవం, డిసెంబర్ 29**

ప్రకృతి వైద్య రంగంలో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించింది. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రకృతి వైద్య సలహాదారుగా ఆయనను నియమిస్తూ ప్రభుత్వం అధికారికంగా జీవో జారీ చేసింది. ఇకపై ఏపీలో ప్రకృతి వైద్య విధానాల ప్రోత్సాహం, ప్రజల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య విధానాల రూపకల్పనలో డాక్టర్ మంతెన ప్రభుత్వానికి సలహాలు అందించనున్నారు. మంతెన సత్యనారాయణ రాజు గత కొన్ని దశాబ్దాలుగా ప్రకృతి వైద్యాన్ని ప్రజల జీవితాలకు దగ్గర చేసే ప్రయత్నంలో ముందుండి పనిచేస్తున్నారు. మందులపై ఆధారపడకుండా ఆహార నియమాలు, జీవనశైలి మార్పుల ద్వారా అనేక రుగ్మతలకు ఉపశమన మార్గాలు చూపించారు. విజయవాడ సమీపంలోని ఉండవల్లి కరకట్టపై ఏర్పాటు చేసిన 'ప్రకృతి చికిత్సాలయం' ద్వారా వేలాది మందికి సేవలందించారు. అలాగే విజయవాడ, నరసాపురం ప్రాంతాల్లో కూడా ఆయన ఆధ్వర్యంలో ఆరోగ్యాలయం కేంద్రాలు పనిచేస్తూ ప్రజలకు వైద్య సహాయం అందిస్తున్నాయి. టీవీ చానళ్లు, యూట్యూబ్ చానళ్ల వంటి వివిధ మాధ్యమాల ద్వారా కూడా ఆయన ప్రకృతి వైద్య విధానాన్ని విస్తృతం చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని కేంద్రంగా చేసుకుని ప్రభుత్వం తీసుకుంటున్న విధానాల్లో ప్రకృతి వైద్యానికి ప్రత్యేక స్థానం కల్పించాలనే లక్ష్యంతోనే ఈ నియామకం చేసినట్లు సమాచారం. ఆధునిక వైద్యం తో పాటు ప్రత్యామ్నాయ చికిత్సా విధానాలను సమన్వయం చేస్తూ ప్రజలకు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవాటు చేయాలన్న దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

**కార్టూనిస్ట్ శ్రీధర్‌కు కూడా కీలక పదవి**

ఇదే సమయంలో, మాస్ కమ్యూనికేషన్ రంగంలో అనుభవం ఉన్న పోచంపల్లి శ్రీధర్ రావును కూడా ఏపీ ప్రభుత్వం సలహాదారుగా నియమించింది. సమాచార ప్రసారం, ప్రజలతో ప్రభుత్వ కార్యక్రమాల అనుసంధానం వంటి అంశాల్లో ఆయన ప్రభుత్వానికి సూచనలు ఇవ్వనున్నారు. పోచంపల్లి శ్రీధర్ రావు అంటే ఎవరో కాదు... ప్రముఖ కార్టూనిస్ట్ గా ఆయన పేరుప్రఖ్యాతులు అందుకున్నారు.

ఈనాడు దినపత్రికకు సుదీర్ఘకాలం సేవలు అందించారు. మంతెన సత్యనారాయణ రాజు, పోచంపల్లి శ్రీధర్ రావు ఇద్దరూ రెండేళ్ల పాటు ఈ సలహాదారు పదవుల్లో కొనసాగనున్నారు. ప్రజారోగ్యం, సమాచార వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఈ నియామకాలు దోహదపడతాయని భావిస్తున్నారు.

# తిరుమల చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి



(మొదటిపేజీ తరువాయి)

ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి, ఏపీ మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్ కూడా పాల్గొన్నారు. నేడు మంగళవారం ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి శ్రీవారిని దర్శించుకోనున్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయన వైకుంఠ ద్వార దర్శనం చేసుకోనున్నారని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. కాగా, సీఎం రేవంత్ రెడ్డి రేపు సాయంత్రం హైదరాబాద్ తిరిగి వస్తారు. ఎల్లుండి నుంచి అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారు.

# చెవిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పు వాయిదా

**అమరావతి- సూర్య వాస్తవం, డిసెంబర్ 29**

మద్యం ముడుపుల కేసులో బెయిల్ ఇవ్వాలంటూ వైసిపి నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి సోమవారం ప్రకటించారు. మద్యం ఉత్పత్తి కంపెనీల నుంచి నెలకు రూ.60 కోట్ల నుంచి రూ.70 కోట్లు వసూలు చేశారని, వీటిని అట్టపెట్టెల్లో పెట్టి చట్టసభ ఎన్నికలకు ఖర్చు పెట్టారని సిఐడి సిట్ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా హైకోర్టులో వాదించారు. చెవిరెడ్డి అండతో తరలిస్తున్న కంటైనర్‌లో రూ.8 కోట్లు సొమ్మును అధికారులు సీజ్ చేశారని చెప్పారు. ఈ కేసు సిట్‌కు బదిలీ అయ్యిందన్నారు. మద్యం ముడుపుల సొమ్మును ఎన్నికల సమయంలో రాష్ట్రంలోని వేర్వేరు నియోజకవర్గాలకు తుడా వాహనాల్లో తరలించడంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కీలక పాత్ర పోషించారని చెప్పారు. వాహనాలను మరోప్రాంతంలో ఉన్నట్లు లాగ్ బుక్ తప్పుగా రికార్డు చేశారని, హైవే టోల్ ప్లాజా సిసి కెమెరాల రికార్డులను పరిశీలిస్తే ఈ విషయం బహిర్గతమైందని తెలిపారు. చెవిరెడ్డి వ్యక్తిగత సెక్యూరిటీ గార్డులుగా ఉన్న కానిస్టేబుళ్లు వాంగ్మూలం ఇచ్చారని తెలిపారు. ఈ ఆధారాలను పరిశీలించిన తరువాతే కింది కోర్టు చెవిరెడ్డికి బెయిల్ నిరాకరించిందని, హైకోర్టు కూడా బెయిల్ మంజూరు చేయవద్దని కోరారు. చెవిరెడ్డి తరపున సీనియర్ న్యాయవాది ఆర్.బసంత్ వాదనలు వినిపిస్తూ, పర్సనల్ సెక్యూరిటీ అధికారి వాంగ్మూలం ఆధారంగా నిందితుడిగా చేయడం అన్యాయమన్నారు. సొమ్ము పిటిషనరుకు చేరినట్లు ఏ ఆధారాలు లేవని, సొమ్ము సీజ్ కూడా చేయలేదని చెప్పారు. సిట్ చార్జిషీట్ దాఖలు చేసినందున బెయిల్ ఇవ్వాలని కోరారు. ఇరుపక్షాల వాదనల తర్వాత హైకోర్టు తీర్పును వాయిదా వేసింది.

# నూతన సంవత్సర కానుకగా మదనపల్లె అన్నమయ్య జిల్లా

- మదనపల్లె కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఏర్పాటుకు ప్రారంభమైన సన్నాహాలు...
- కలెక్టర్ కార్యాలయంగా మారనున్న మదనపల్లె సబ్ కలెక్టరేట్
- అన్నమయ్య జిల్లా నేమ్ బోర్డు ఏర్పాటుకు చర్యలు



**మదనపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 29:** మదనపల్లె జిల్లా కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ఆంధ్రప్రదేశ్ జిల్లాల పునర్విభజన ప్రతిపాదనలకు రాష్ట్ర క్యాబినెట్ సోమవారం ఆమోదం తెలిపిన నేపథ్యంలో కొత్తగా మదనపల్లి కేంద్రంగా అన్నమయ్య జిల్లాను ప్రకటించారు. అన్నమయ్య జిల్లాలోని రాయచోటిని మదనపల్లి కొత్త జిల్లాకు, రాజంపేట ను కడపకు, రైల్వే కోడూరు తిరుపతికి మార్చే ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో హుటాహుటిన అధికారులు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలకు సిద్ధమయ్యారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం నేమ్ బోర్డు తొలగించి అన్నమయ్య జిల్లా కేంద్రం నేమ్ బోర్డ్ ఏర్పాటు చేసేందుకు పనులు మొదలయ్యాయి. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంగా కొనసాగించనున్నారు. ఎస్పీ కార్యాలయంగా పట్టణంలోని బెంగళూరు రోడ్లోని రేస్ కాలేజీను ఎస్పీ కార్యాలయంగా ఎంపిక చేశారు. ప్రస్తుతం ఉన్న డిఎస్పి బంగ్లాను పడదోసి నూతన ఎస్పీ క్యాంప్ కార్యాలయంగా మార్చేందుకు సిద్ధం చేస్తున్నారు. ఎట్టకేలకు మదనపల్లి జిల్లా కేంద్రం నూతన సంవత్సర కానుకగా ఏర్పాటు కానుండటంపై మదనపల్లె నియోజకవర్గ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.oo

# లక్ష్మీనగర్ మురికివాడ వాసులకు ఇళ్లు నిర్మిస్తాం

- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ



**విశాఖ - సూర్య వాస్తవం, డిసెంబర్ 29:** విశాఖ దక్షిణ నియోజకవర్గంలోని అత్యంత వెనుకబడిన మురికివాడగా గుర్తింపు పొందిన వెలంపేట లక్ష్మీనగర్ మురికివాడలో వీలైనంత త్వరగా పక్కా గృహాలను నిర్మించి ఇవ్వనున్నట్లు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ హామీ ఇచ్చారు. సోమవారం ఉదయం ఆయన లక్ష్మీ నగర్ స్లమ్ ప్రాంతాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి ఆదేశం మేరకు తాను ఈ మురికివాడకు వచ్చి, ఇక్కడ నివసిస్తున్న వారి పరిస్థితులను తెలుసుకున్నానని చెప్పారు. ఇక్కడ చాలా ఏళ్లుగా నివసిస్తున్న 177 కుటుంబాల వారి పరిస్థితి అత్యంత దారుణంగా ఉందన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా మురికివాడ ప్రాంతాలు కలిగి ఉన్న విశాఖ నగరంలో నిర్వాసితులకు తక్షణమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ లక్ష్మీనగర్ మురికివాడ ప్రాంతం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఎల్ఎ వంశీకృష్ణ శ్రీనివాస్, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, విఎమ్ఆర్‌డిఎ కమిషనర్ ఎన్.తేజ్ భరత్, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, జివిఎంసి అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి, ప్రధాన ఇంజనీర్ పి.వి.సత్యనారాయణ రాజు, జోన్ 4 కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు, పర్యవేక్షిక ఇంజనీర్ పల్లమరాజు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## మొన్న డీకే, నిన్న శశి, ఇవాళ డిగ్గీ

భారత జాతీయ కాంగ్రెస్ ప్రస్తుతం ఒక విచిత్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. బయటి శత్రువుల కంటే, పార్టీ అంతర్గత నేతల వైఖరే అధిష్టానానికి పెద్ద తలనొప్పిగా మారింది. రెస్సెస్, బీజేపీలపై ప్రశంసలు గుప్పించే కాంగ్రెస్ నేతలు రోజురోజుకూ పెరిగిపోతుండటం హస్తం పార్టీ హైకమాండ్‌కు కొత్త తలనొప్పిగా మారింది. కొన్ని రోజుల క్రితం ఆరెస్సెస్‌పై డీకే శివకుమార్ ప్రశంసలు చేయగా.. గత కొంతకాలంగా శశిథరూర్ కూడా బీజేపీని పొగుడుతున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఆరెస్సెస్‌ను పొగుడుతూ దిగ్విజయ్ సింగ్ పెట్టిన పోస్ట్ పెను సంచలనంగా మారింది. దీంతో కాంగ్రెస్, బీజేపీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.కాంగ్రెస్ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ తాజాగా చేసిన వ్యాఖ్యలు ఈ వాదనకు బలం చేకూరుస్తున్నాయి. కరుడుగట్టిన ఆర్ఎస్ఎస్ వ్యతిరేకిగా ముద్రపడిన దిగ్విజయ్ సింగ్, హఠాత్తుగా ఆ సంస్థ పనితీరును ఉదాహరణగా చూపడం రాజకీయ వర్గాల్లోనే కాక, సొంత పార్టీలోనూ పెను దుమారం రేపుతోంది.ఉపాధి హామీ పథకం పేరు మార్పు అంశంపై కేంద్రంపై పోరుకు సిద్ధమవుతూ, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం కానున్న తరుణంలో దిగ్విజయ్ సింగ్ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ పార్టీని ఇరకాటంలో నెట్టింది. "ఆర్ఎస్ఎస్‌లో నాయకుల పాదాల వద్ద కూర్చున్న ఓ సామాన్య కార్యకర్త.. రాష్ట్రానికి సీఎంగా, దేశానికి ప్రధానిగా ఎలా ఎదిగారో చూడండి. ఇది ఆర్ఎస్ఎస్, బీజేపీలకు ఉన్న సంస్థాగతమైన శక్తి" అంటూ ప్రధాని మోదీ ఫోటోను జత చేస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు పరోక్ష ప్రశంసల్లా ధ్వనించాయి. నిజానికి దిగ్విజయ్ ఉద్దేశం.. కాంగ్రెస్ పార్టీ కూడా సంస్థాగతంగా అంత బలంగా తయారుకావాలని చెప్పడమే కావచ్చు. ఆ తర్వాత ఆయన.. "నేను ఆర్ఎస్ఎస్, బీజేపీలకు బద్ధ వ్యతిరేకిని" అని వివరణ ఇచ్చినప్పటికీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను తీవ్రంగా వ్యతిరేకించాల్సిన సమయంలో, వారి సంస్థాగత నిర్మాణాన్ని కీర్తించడం ద్వారా కార్యకర్తల్లో గందరగోళం సృష్టించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.కాంగ్రెస్ పార్టీలో ఇలాంటి పరిణామాలు కొత్తేమీ కాదు. ఇటీవల కాలంలో పలువురు సీనియర్ నేతలు బీజేపీకి, ఆరెస్సెస్‌కు సానుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కేరళకు చెందిన సీనియర్ నేత శశిథరూర్ వ్యవహారశైలిపై పార్టీలో ఎప్పటినుంచో అసంతృప్తి ఉంది. ఆయన తరచుగా ప్రధాని మోదీని ప్రశంసించడం, లేదా బీజేపీ విధానాలపై మృదు వైఖరి అవలంబించడం చర్చనీయాంశమైంది. తిరువనంతపురంలో బీజేపీ ఓటు బ్యాంకు పెరగడానికి, లేదా అక్కడ ఆ పార్టీ బలపడడానికి థరూర్ వైఖరే కారణమనే అనుమానాలు సొంత పార్టీ నేతల్లోనే ఉన్నాయి. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వంటి మాస్ లీడర్ ఏకంగా అసెంబ్లీ వేదికగా ఆర్ఎస్ఎస్ గీతాన్ని ఆలపించడం ఆ మధ్య పెద్ద వివాదానికే దారితీసింది. ఇది లౌకికవాద పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్ సిద్ధాంతాలకు పూర్తిగా విరుద్ధమనే విమర్శలు వచ్చాయి.కాంగ్రెస్ సీనియర్ నేతల ఈ ప్రవర్తన వెనుక అనేక కారణాలు కనిపిస్తున్నాయి. దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న నేతలు, బీజేపీ క్షేత్రస్థాయి నెట్‌వర్క్‌ను చూసి, తమ పార్టీలోని సంస్థాగత లోపాలపై అసహనంతో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారా అనే కోణం ఉంది. దిగ్విజయ్ వ్యాఖ్యల్లో ప్రశంస కంటే, కాంగ్రెస్ నాయకత్వానికి మేల్కొనండి అని చెప్పే హెచ్చరిక కూడా ఉండవచ్చు. రాహుల్ గాంధీ ఒకవైపు ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతుంటే, సీనియర్ నేతలు మాత్రం దానికి భిన్నంగా వ్యవహరించడం.. పార్టీలో కమాండ్ అండ్ కంట్రోల్ లోపించిందన్న సంకేతాలను ఇస్తోంది. ఇప్పటికే అనేకమంది కాంగ్రెస్ నేతలు బీజేపీ గూటికి చేరారు. ఇప్పుడు పార్టీలో ఉంటూనే ఇలా వ్యాఖ్యలు చేస్తున్నవారు కూడా భవిష్యత్తులో గోడ దూకే అవకాశం ఉందన్న అనుమానాలు కేడర్‌ను వెంటాడుతున్నాయి.దిగ్విజయ్ సింగ్ ఉద్దేశం ఏదైనప్పటికీ, టైమింగ్ మాత్రం పూర్తిగా బెడిసికొట్టింది. యుద్ధం జరుగుతున్నప్పుడు శత్రువు కత్తి పదునును పొగడడం సొంత సైన్యం మనోధైర్యాన్ని దెబ్బతీయడమే అవుతుంది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం జరుగుతున్న సమయంలోనే దిగ్విజయ్ సింగ్ చేసిన ఈ పోస్ట్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. 1990వ దశకంలో గుజరాత్ మాజీ సీఎం శంకర్‌సింగ్ వాఘేలా ప్రమాణ స్వీకార వేడుకలో తీసిన ఒక బ్లాక్ అండ్ వైట్ ఫోటోను తాజాగా దిగ్విజయ్ సింగ్ పెట్టిన పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. ఆ ఫోటోలో యువకుడిగా ఉన్న నరేంద్ర మోదీ , సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ.. పాదాల దగ్గర కింద నేలపై కూర్చుని ఉన్నారు.ఈ ఫోటోను షేర్ చేసిన దిగ్విజయ్ సింగ్.. "ఈ ఫోటో చాలా ప్రభావవంతంగా ఉంది. ఆర్ఎస్ఎస్ స్థాయి కార్యకర్త, జనసంఘ్, బీజేపీ వర్కర్ ఎలా ఎదిగారో ఇది చూపిస్తుంది. పార్టీ అగ్రనాయకుల పాదాల దగ్గర నేలపై కూర్చున్న ఒక సామాన్య కార్యకర్త.. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా.. ఆ తర్వాత దేశ ప్రధానమంత్రిగా ఎదగడం అనేది ఆ సంస్థ శక్తికి నిదర్శనం. జై సియా రామ్" అని తన పోస్ట్‌ను ముగించారు.బీజేపీని సిద్ధాంతపరంగా ఎదుర్కోవాల్సిన సమయంలో, కాంగ్రెస్ సీనియర్లే ఆ పార్టీ సంస్థాగత బలాన్ని కీర్తించడం, పరోక్షంగా బీజేపీ నరేటివ్‌కే మేలు చేస్తోంది. ఈ అంతర్గత గందరగోళాన్ని చక్కదిద్దకపోతే, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ఇది మరింత పెద్ద రాజకీయ సవాలుగా మారే ప్రమాదం ఉంది.

# ముక్కోటి ఏకాదశి ..ఉత్తర ద్వార దర్శనం విశిష్టత

## మూడు కోట్ల దేవతలు భూమికి దిగివచ్చే ఆ పుణ్యదినం వెనుకున్న రహస్యం ఇదే!




**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 29:** శ్రీ మహా విష్ణువు గరుడ వాహనుడై ముక్కోటి దేవతలతో కలిసి భూమి పైకి వచ్చే పుణ్యదినం ముక్కోటి ఏకాదశి. మార్గశిర, పుష్య మా సాల్లో వచ్చే శుద్ధ ఏకాదశిని వైకుంఠ ఏకాదశి అని, ముక్కోటి ఏకాదశి అని అంటారు. ఇలా రెండు మాసాల్లో ఎందుకు? అసలు వైకుంఠ ఏకాదశిని ఎలా నిర్ధారిస్తారు? ఆ రోజు విశిష్టత ఏమిటి? ఈ రోజు ఆచరించాల్సిన విధి విధానాలేంటి? తదితర అంశాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

**ముక్కోటి ఏకాదశిని ఎలా నిర్ధారిస్తారు?**

ఒక ఏడాదిలో 24 ఏకాదశులు వస్తాయి. అన్ని ఏకాదశులు విశిష్టమైనవే అయినప్పటికీ ముక్కోటి ఏకాదశి, తొలి ఏకాదశి, చిలుక ఏకాదశి కోటిరెట్ల విశేషమైనవి. ముక్కోటి ఏకాదశి సాధారణంగా మార్గశిర మాసంలో కానీ, పుష్య మాసంలో కానీ వస్తుంది. సూర్యుడు ధనస్సు రాశిలోకి ప్రవేశించాక ధనుర్మాసం ఏర్పడుతుంది. ఈ ధనుర్మాసంలో వచ్చే శుద్ధ ఏకాదశిని ముక్కోటి ఏకాదశిగా జరుపుకోవాలని శాస్త్రాల్లో వివరించి ఉంది. ముక్కోటి ఏకాదశి రోజు మూడు కోట్ల దేవతలు భూమిపైకి వస్తారని శాస్త్రవచనం.

**మోక్షదా ఏకాదశి**

భగవంతుడు చింతామణిలా భక్తుల సమస్త కోర్కెలు తీర్చి మోక్షాన్ని ప్రసాదించే ఏకాదశి కాబట్టి దీనిని మోక్షదా ఏకాదశి అని కూడా అంటారు. శ్రీ మహావిష్ణువు గరుడ వాహనంపై ముక్కోటి దేవతలకు, భక్తులకు ఉత్తర ద్వారంలో దర్శనమి స్తాడు కాబట్టి ఈ ఏకాదశిని ముక్కోటి ఏకాదశి అని పేరు వచ్చిందని అష్టాదశ పురాణాలు వివరిస్తున్నాయి. తెలుగు పంచాంగం ప్రకారం డిసెంబర్ 30, మంగళవారం పుష్య శుద్ధ ఏకాదశిని ముక్కోటి ఏకాదశిగా జరుపుకోవాలని పంచాంగకర్తలు సూచిస్తున్నారు.

**ముక్కోటి ఏకాదశి రోజు ఏం చేయాలి?**

ధనుర్మాసం వేళ ఆధ్యాత్మిక వైభవాన్ని రెట్టింపు చేసే పర్వదినం ఈ ముక్కోటి ఏకాదశి. ఈ పర్వదినం రోజు ప్రతి ఒక్కరు బ్రాహ్మీ ముహూర్తంలో నిద్ర లేచి నదీస్నానం చేయడం సర్వోత్త మమని శాస్త్రాలు చెబుతున్నాయి. నదీస్నానం వీలుకానివారు స్నానం చేసే నీటిలో గంగాజలాన్ని కలుపుకుని స్నానం చేయవచ్చు. అది కూడా వీలు కాని వారు స్నానం చేసే నీటిలో సమస్త పుణ్య నదులను ఆవాహన చేసుకుని స్నానం చేయడం వలన నదీ స్నానం చేసిన పుణ్య ఫలం దక్కుతుంది.

**నిత్యపూజలు**

బ్రాహ్మీ ముహూర్తంలో మనం నివసించే ఇంట్లోని పూజా మందిరాన్ని శుభ్రం చేసుకుని ఆవునేతితో దీపారాధన చేయాలి. లక్ష్మీ నారాయణులను తులసిమాలలతో, గంధ పుష్పాలతో అలంకరించి షోడశోపచార పూజలు చేయాలి. శ్రీ మహా విష్ణువుకు ప్రీతికరమైన చక్రపొంగలి నివేదించాలి. అనంతరం బ్రాహ్మీ ముహూర్తం పూర్తయ్యేలోపు వైష్ణవాల యానికి వెళ్లి ఉత్తర ద్వారం నుంచి శ్రీమన్నారాయణుని దర్శించాలి. ఈ రోజు నారాయణుని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకుంటే ఆయన అనుగ్రహంతో పాటు సకల శుభాలు కలుగుతాయి. ముక్కోటి ఏకాదశి రోజు శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ చేయడం మోక్ష కారకమని బ్రహ్మాండ పురాణం వివరిస్తోంది.

**ఉపవాసం**

ముక్కోటి ఏకాదశి రోజు ఎవరైతే ఉపవాసం చేస్తారో వారికి విష్ణువు అనుగ్రహంతో సకల విజయాలు కలుగుతాయని విశ్వాసం. ఏకాదశి రోజు అన్నం, పప్పుధాన్యాలు తీసుకోవడం నిషిద్ధమని ఏకాదశి వ్రత మహత్యంలో వివరించి ఉంది. అందుకే ఈరోజు పగలంతా ఉపవాసం ఉండి సాయంత్రం చంద్రోదయానికి పూర్వమే పండ్లు, పాలు వంటి సాత్విక ఆహారం తీసుకుంటే ఏకాదశి వ్రత ఫలం సంపూర్ణంగా దక్కుతుందని విశ్వాసం.

**జాగారం**

ముక్కోటి ఏకాదశి రోజు రాత్రి భగవంతుని కీర్తనలు, భజనలు పాడుతూ, భాగవత కథా చర్చలు చేస్తూ జాగరణ చేయాలి. జాగారం అనే పదానికి జాగరూకతతో ఉండటం అని అర్థం. ఏడాదికోసారి భగవంతుని సేవలో మోక్షార్థులై మేలుకొని ఉండడాన్ని జాగరణ అంటారు. ముక్కోటి ఏకాదశి రోజు జాగరణ చేసిన వారికి మూడు కోట్ల జన్మల పాపాలు పోతాయని విష్ణు పురాణం చెబుతోంది.

**ఏకాదశి అంతరార్థం**

ఏకాదశి అంటే 11. ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రి యాలు, మనసు కలిపి మొత్తం 11. ఏకాదశి ఉపవాసం రోజు ఈ పదకొండు అదుపులో ఉంచుకుని వాటిపై నియంత్రణ సాధిస్తూ ఏకాదశి దీక్ష చేయడమే ఏకాదశి వ్రతం అంతరార్థం. రానున్న ముక్కోటి ఏకాదశి రోజు మనం కూడా ఉపవాస జాగారాలతో విష్ణుమూర్తిని పూజించి మోక్షాన్ని పొందుదాం.

### మిట్ట మల్లేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 29:** పులివెందుల పట్టణంలోని గుంత బజార్ సమీపంలో ఉన్న ఎంతో పురా తనమైన ప్రసిద్ధిగాంచిన శ్రీ మిట్ట మల్లేశ్వర స్వామి ఆలయంలో సోమవారాన్ని పురస్కరించుకొని శ్రీ మిట్టమ ల్లేశ్వరుని విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా తెల్లవారుజామున నుండి స్వామి వారికి ప్రధాన అర్చకులు రుద్ర, శివ స్వాముల ఆధ్వ ర్యంలో స్వామి వారికి పంచా మృత అ భిషేకం, భస్మాభిషేకం, సహస్ర నామ అష్టోత్తర శతనామావళి, భీష్మాభిషేకం, లిం గా ష్టకం తదితర పూజా కైకర్యాల అనంతరం మిట్ట మల్లేశ్వరుడు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శ నమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ చింత కుంటను ధీకర రెడ్డి, నిర్వహకులు మాట్లాడుతూ శివాలయంలో ప్రతిరోజు విశేష పూజలు ధూప, దీప, నైవేద్యాలు, ఘనంగా నిర్వహించడం జరు గుతోందని అన్నారు. సోమవారాన్ని పురస్కరిం చుకొని ఆల యానికి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పరమశివునికి ఎంతో నమ్మకంతో భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించి విశేష పూజలు నిర్వ హించ డం జరుగుతుందన్నారు. అనంతరం అనంతరం ఆలయ నిర్వా హకులు ఏర్పా టుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అంద జేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఎండో మెంట్ సిబ్బంది ఆలయ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

# పీలేరులో మాజీ సైనికుడిపై రియల్టర్ల దాడి

- ఆలస్యంగా దాడి వీడియో వెలుగులోకి..
- దాడిని తీవ్రంగా ఖండించిన మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులు నాయుడు
- పోలీసులు రియల్టర్లకు వత్తాసు పలికిన మాజీ సైనికుడుపై కేసు నమోదు చేయడంపై ఆగ్రహం
- మాజీ సైనికుడికి అండగా ఉంటూ న్యాయం జరిగేదాకా పోరాటాలు చేస్తామన్న కంచర్ల







**మదనపల్లి– సూర్య వాస్తవం, డిసెంబర్ 29:** పీలేరుకు చెందిన మాజీ సైనికుడి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పై రియల్టర్లు దాడిచేసి రక్తం కారేలా కొట్టారని, మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు నాయుడు మండి పడ్డారు. మదనపల్లెలో సోమవారం మీడియాతో మాట్లా డుతూ.. భూ కబ్జాకు పాల్పడ్డవారిని వదిలేసి కబ్జారా యుళ్లకు పోలీ సులు సపోర్టు చేయడం ఎంతవరకు సబబన్నారు. మాజీ సైనికుడిపైనే కేసు పెట్టడాన్ని తప్పుబట్టారు. లక్ష్మీ ప్రసాద్‌కు అండగా ఉండి న్యాయ పోరాటం చేస్తామన్నారు. కాగా మాజీ సైనికుడు లక్ష్మీప్రసాద్ రెడ్డి భూమిని కబ్జా రాయళ్లు, రియల్టర్లు దౌర్జన్యంగా ఆక్రమించి అడ్డుకున్న లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పై దాడికి పాల్పడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారడాన్ని చూసి, మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సైనికుడికి తాము అండగా ఉండి న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. దేశ సరిహద్దుల్లో పనిచేసిన మాజీ సైనికునికి పోలీసులు ఇచ్చే గౌరవం ఇదేనా అన్నారు. సమస్యను ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి బాధ్యులకు తగిన గుణ పాఠం చెబుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు

# మేమున్నాం.....!

- సహోద్యోగి కుటుంబానికి బాసుటగా..
- ఆదర్శంగా నిలిచిన 14వ బెటాలియన్ సిబ్బంది





**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 29:** వారు అంత వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారైనా ఉద్యోగ రీత్యా ఒకే గూటికి చేరారు. కుల, మతాలకు తావు లేకుండా పోలీస్ డిపార్ట్మెంట్ వారందరిలో సోదరభావాన్ని నెలకొల్పింది. పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటూ సేవా గుణాన్ని చాటుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు 14 వ బటాలియన్ పోలీసులు. అసలు వివరల్లోకి వెళితే.... 2009 బ్యాచ్ కు చెందిన 14వ బెటాలియన్ కానిస్టేబుల్ రామాంజనేయులుకు ప్రమాదానికి గురై ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న తోటి సహచర బ్యాచ్ మేట్స్ అందరు కలిసి రూ. 80.500 రామాంజ నేయులు చికిత్స కై అతని కుటుంబానికి అందచేశారు. ఆపద వస్తే మేమున్నామంటూ భరోసా కల్పించారు. ఇబ్బందుల్లో ఉన్నప్పుడు మేమున్నామని.. మీకేం కాదని అండగా నిలిచి వారికి తోచినంత ఆర్థిక సహాయం చేస్తూ మానవత్వం చాటుకుంటున్నారు.

## ప్రజలకు ఎంపీ అవినాష్ రెడ్డి
# నూతన సంవత్సర శుభాకాంక్షలు



**పులివెందుల– సూర్య వాస్తవం, డిసెంబర్ 29:** కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భం గా అవినాష్ రెడ్డి మాట్లాడుతూ 2025 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2026 నూతన సంవత్సరానికి స్వాగతం పలికే సమయం ఆసన్నమైనదని ఏడాదిలో సరికొత్త ఆలోచనలు, ఆశయాల కలబోతతో అన్ని ఆటంకాలు తొలగిపోయి 2026 సంవత్సరంలో జీవితం అద్భుతంగా ఆనందంగా ముందుకు సాగాలని, మీరు చేపట్టే పనులు అన్ని ఎలాంటి విఘ్నాలు లేకుండా చూడాలని ప్రజలందరికీ నూతన సంవత్సర శు

# ఒక్కరోజు ముందే పింఛన్ పంపిణీ

**- పులివెందుల పురపాలక కమిషనర్ రాముడు**



**పులివెందుల – సూర్య వాస్తవం, డిసెంబర్ 29:** జనవరి 2026 ఒకటో తారీకు ఇవ్వవలసిన పెన్షన్లను ఒక్కరోజు ముందుగానే డిసెంబర్ 31వ తేదీ నుండి పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతుందని పురపాలక కమిషనర్ రాముడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన పత్రికంగా తెలియజేస్తూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వారి ఉత్తర్వుల మేరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ద్వారా పంపిణీ చేయుచున్న సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నూతన సంవత్సరం దృష్ట్యా 01.01.2026వ తేదీకి బదులు ఒకరోజు ముందుగా అనగా 31.12.2025 వ తేదీన పంపిణీ చేయ బడును. కావున పెన్షన్ దారులు అందరూ 31.12.2025 వ తేదీన పెన్షన్ పంపిణీ చేయు అధికారులకు ఇంటి వద్దనే అందుబాటులో ఉండి పెన్షన్ పొందవలసినదిగా తెలియ జేశారు. ఎవరూ కూడా సచివాలయం వద్దకు గానీ మరి ఏ ఇతర ఆఫీసుల వద్దకు గానీ వెళ్ళవలసిన అవసరం లేదని తెలియజేశారు.

# తప్పిపోయిన వృద్ధురాలిని కుటుంబసభ్యులకు అప్పగింత

**- ఆమ్ ఆద్మీపార్టీ**




**వేంపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 29:** వేంపల్లి పట్టణంలో గత శుక్రవారం నాలుగు రోడ్ల కూడలిలో మతిస్థి మితం లేనివిధంగా వ్యవహరిస్తున్న ఒకమహిళా వృద్ధురాలు తిరుగుతుందంటూ స్థానిక వ్యక్తులు ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ రహమతుల్లాకు ఫోన్ చేయగా ఆయన స్పందించి నాలుగు రోడ్ల కూడాకి చేరుకొని అసలే చలికాలం కావడంతో ఆమెఆరోగ్యరీత్యా ఆమెను రాజీవ్ కాలనీలోని అమ్మఅనాధ ఆశ్రమంలో నిర్వాహకులు వెంకటసుబ్బయ్య ఆధీనంలోఉంచి ఫేస్బుక్ సోషల్ మీడియా వాట్సాప్ మాధ్యమంలో ఆ పెద్దమ్మ ఫోటో వీడియోలు పోస్ట్ చేసి వారి కుటుంబసభ్యులకు చేరేలా సహకరించండి అంటూ ఆమ్ ఆద్మీ పార్టీ రహమతుల్లా కోరగా ఫేస్బుక్‌లో చూసి గుర్తించిన కడపకుచందినఆమె కుటుంబ సభ్యులు నిన్న రాత్రి రహమతుల్లా ఫోన్ చేసి ఈరోజు ఉదయం వేంపల్లి రాజీవ్ కాలనీకు చేరుకుని ఆమెను తీసుకుని పోవాలని వచ్చిన వారి కుటుంబ సభ్యులకు ఆమ్ ఆద్మీ పార్టీ రహమతుల్లా ఆశ్రమ నిర్వాహకులు వెంకటసుబ్బయ్య వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు ఆమెను అప్పగించి నందుకు వారి కుటుంబ సభ్యులు రహమతుల్లాకు వేంపల్లి ఎస్సై తిరుపాల్ నాయక్‌కి వెంకటసుబ్బయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు... ఈ కార్యక్రమంలో ఆప్ మండల సభ్యులు ఎస్ఎండి గోస్, అర్షద్, తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ స్మారకార్థం దివ్యాంగులకు రైస్ కుక్కర్లు వితరణ

**- మానవతామూర్తి దేవిరెడ్డి లక్ష్మీనరసమ్మ చరితార్థురాలు**

**- వికలాంగుల నెట్‌వర్క్ అధ్యక్షులు రఘునాథరెడ్డి**





**పులివెందుల – సూర్య వాస్తవం, డిసెంబర్ 29:** సౌమ్యురాలు, సహృదయురాలు, మంచికి మారుపేరు, మానవ తామూర్తి, ఆకలిగొన్న వారి కడుపు నింపే అన్నపూర్ణగా, పరోప ంకారిగా, ఉత్తమ సహధర్మచారిణిగా, కోరగుంటపల్లి గ్రామంలో గ్రామస్తులందరి మన్ననలు చూరగొన్న దేవిరెడ్డి కుటుంబంలో మణిదీపం స్వర్గీయ దేవిరెడ్డి లక్ష్మీనరసమ్మ పరిపూర్ణ జీవితం అనుభవించి, చరితార్థ రాలిగా ఆపరమా త్ముని సాన్నిధ్యం చేరుకున్నారని, కోర గుంటపల్లె దేవిరెడ్డి కుటుంబ సభ్యులు త్యాగనిరతి, నాయకత్వలక్షణాలు, సేవాతత్పరత కలిగిన వ్యక్తులుగా జిల్లాలోనే పేరుప్రఖ్యాతలు పొందారని, వారి కుటుంబానికి ఆ దేవుని ఆశీస్సులు ఎల్లవేళలా మెండుగా ఉండాలని వికలాంగుల నెట్ వర్క్ అధ్యక్షులు డాక్టర్ ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి పేర్కొన్నారు. వైఎస్ఆర్సిపి సింహాద్రిపురం మండల ఇంచార్జ్ దేవిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి మాతృమూర్తి దివంగత లక్ష్మీనరసమ్మ ప్రథమవర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని ముద్దనూరు రోడ్డులోగల వికలాంగుల కమ్యూనిటీ భవనంలో దేవరెడ్డి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంస్మరణ కార్యక్రమంలో ప్రముఖులు, ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళి అర్పించారు. వారి పవిత్రఆత్మకు శాంతి చేకూరాలని రెండునిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం శ్రీకాంత్ రెడ్డి సమకూర్చిన ఎలక్ట్రికల్ రైస్ కుక్కర్లు 20 మంది దివ్యాంగుల కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా దేవిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి సేవాస్ఫూర్తిని పలువురు అభినందించారు. ఈకార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి బావ సారెడ్డి కృష్ణారెడ్డి, వారి సహచరులు సురేష్ నాయక్, పార్నపల్లె నాయుడు, ఎర్రగుడిపల్లె కౌన్సిలర్ బొగ్గిటి పురుషోత్తం, వైఎస్ఆర్సిపి చేనేత విభాగం అధ్యక్షులు ఈశ్వరయ్య, అరుణ్, వాసు తదితరులు పాల్గొన్నారు.

## మోడీ పాలనలో 2025

# విఫల సంవత్సరం కావడం శోచనీయం

**- కనీసం 2026 సంవత్సరమైనా సఫల సంవత్సరం కావాలని ఆశిద్దాం**

**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 29:** నరేంద్ర మోడీ పాలనలో 2025 సంవత్సరం విఫల సంవత్సరముగా తయారు కావడం దురదృష్టకరం, శోచనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి అన్నారు. సోమవారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2025వ సంవత్సరంలో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనేక విధాలుగా వైఫల్యం చెందిందని ధ్వజమెత్తారు.

**రూపాయి పతనం**

గతంలో ఎన్నడూ లేని విధంగా డాలర్ తో పోలిస్తే రూపాయి విలువ అధః పాతాళానికి పడిపోయింది. ఒక డాలర్ విలువ రూ 91.04. దీనివలన భారతీయ విద్యార్థులకు విదేశీ విద్య భారమైంది.భారత్ దిగుమతులపై ఆర్థిక భారం పడింది.

**బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు**

పొరుగు దేశం, మిత్ర దేశం అయినటువంటి బంగ్లాదేశ్లో మోడీ పాలనలో ఉన్న హిందువులపై దాడులు జరగడం, వారు అభద్రతాభావంలో ఉండిపోవడం దురదృష్టకరం.

**అమెరికాలో అక్రమ వలసదారులు**

వివిధ కారణాల రీత్యా అమెరికాలో ఉంటున్న భారత అక్రమ వలసదారులను అమెరికా ప్రభుత్వం మానవత్వం లేకుండా చేతులకు సంకెళ్లు వేసి, కాళ్లకు గొలుసులు కట్టి సైనిక విమానాలలో పశువుల కంటే హీనంగా అమెరికా నుంచి భారతదేశానికి పంపిస్తే మోడీ ప్రభుత్వం కనీసం నిరసన కూడా తెలియజేయలేదు.మన విమానాలు పంపి మన వారిని తీసుకురాలేదు. చిన్న దేశాలైన కొలంబియా, మెక్సికో లాంటి దేశాలు అమెరికా ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశాయి.తమ విమానాలు పంపి తమ వారిని తీసుకువచ్చాయి.

**ఇండిగో సంక్షోభం**

ఒకరోజు కాదు.డిసెంబర్ రెండో తారీఖు నుంచి డిసెంబర్ 12వ తారీకు వరకు 10 రోజులపాటు ఇండిగో విమానాల సంక్షోభం దేశాన్ని కుదిపేసింది. దాదాపు 1000 ఇండిగో విమానాలు రద్దయ్యాయి.విమాన ప్రయాణికులు నరకం చూశారు.మోడీ ప్రభుత్వం వైఫల్యానికి ఇది పరాకాష్ట.

**ఢిల్లీ కాలుష్యం**

దేశ రాజధాని ఢిల్లీ కాలుష్యం కారణంగా నివాసయోగ్యం కాని స్థితికి చేరుకోవడం సిగ్గుచేటు.

**అప్పుల భారత్**

1947 నుంచి 2014 వరకు 67 సంవత్సరాల లో పండిట్ నెహ్రూ మొదలుకొని మన్మోహన్ సింగ్ వరకు 12 మంది ప్రధాను ల కాలంలో కేంద్ర ప్రభుత్వం చేసిన అప్పురు 40 లక్షల కోట్లు కాగా, 11 సంవత్సరాల లో మోడీ ప్రభుత్వం చేసిన అదనపు 140 లక్షల కోట్ల రూపాయలు కావడం గర్హనీయం.

**తలసరి ఆదాయం**

ఇంటర్నేషనల్ మానిటరీ పండు ప్రకారం 2025లో భారతదేశపు తలసరి ఆదాయం 2008 డాలర్లు.ప్రపంచ దేశాలలో మనది 144వ ర్యాంకు. సంతోష సూచికలో మనది 144వ ర్యాంక్, ఆకలి సూచిక లో మనది 116వ ర్యాంకు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న గవాయి మీద ఒక అడ్వకేట్ బూట్ విసర్గం సిగ్గుచేటు. భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ రాజీనామా చేయగా ఆయనకు కనీసం వీడ్కోలు కూడా పలకలేదు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుండి మహాత్మా గాంధీ పేరు తొలగించి జాతిపితను అవమానించడం జరిగింది. జాతిపితను అవమానించడం అంటే జాతిని అవమానించడమే.

రైతుల పరిస్థితి గతంలో ఎన్నడు లేని విధంగా 2025లో దయనీయంగా మారింది.ఏ పంటకు గిట్టుబాటు ధర లభించలేదు. ఎరువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడ్డారు.

భద్రతా వైఫల్యం కారణంగా జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడులు జరిగాయి.26 మంది చంపబడ్డారు. అక్కడ కనీసం ఒక హెూంగార్డు కానీ,కానిస్టేబుల్ కానీ ఉండి ఉంటే ఉగ్రవాదుల దాడులు జరిగి ఉండేవి కావు. ఆపరేషన్ సింధూరు అవసరం వచ్చేది కాదు

2025లో ఆంధ్రప్రదేశ్ కు తీరని అన్యాయం జరిగింది.సంజీవని ఇలాంటి ప్రత్యేక హెూదా రాలేదు. రాయలసీమకు, ఉత్తరాంధ్రకు బుందేల?ండ్ తరహా స్పెషల్ డెవలప్మెంట్ ప్యాకేజీ రాలేదు. కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కాలేదు. దుగ్గరాజుపట్నం మేజర్ ఓడరేవు నిర్మించబడలేదు. రాజధాని కి నిధులు రాలేదు. పోలవరం నత్త నడక సాగుతోంది.డబుల్ ఇంజన్ ట్రబుల్ ఇంజన్ అయింది.కేంద్రం నుండి రాష్ట్రానికి రావలసిన నిధులు తగ్గిపోయాయి. ఈ విధంగా ఏ కోణంలో చూసిన 2025 వ సంవత్సరం మోడీ పాలనలో విఫల సంవత్సరంగా తయారైంది. కనీసం 2026 నూతన సంవత్సరమైనా సఫల సంవత్సరం కావాలని ఆశిద్దామని తులసి రెడ్డి అన్నారు. మీడియా సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం,ప్రసాద్ గౌడ్,విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి,వేంపల్లి మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న, తోపి రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బండారు వెంకటేశు,నాగరాజు, ఐచర్ రమణ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# పాడి రైతులకు పశుపోషణపై అవగాహన కల్పించాలి


**- : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**



**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం, డిసెంబర్ 29 :** పాడి రైతులకు అధిక పాల ఉత్పత్తి, మేలు జాతి పశు పోషణపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో "అనంత పాలధార" అను పేరుతో రూపొందించిన కరపత్రికలు, గోడపత్రికలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాడి రైతులకు అధిక పాల ఉత్పత్తి పట్ల, మేలు జాతి పశుపోషణ పైన అవగాహన కల్పించే విధంగా అనంతపురం జిల్లా స్థాయి పాల పోటీలను ఆకుతోటపల్లి గ్రామంలో జనవరి 7, 8 తారీఖుల్లో నిర్వహించనున్నారన్నారు. 9వ తారీఖున బహుమతి ప్రధానం, ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం, మేలు జాతి దూడలు ప్రదర్శన నిర్వహించనున్నారన్నారు. అధిక పాల దిగుబడి ఉండి పోటీలో పాల్గొనదలచిన పశుపోషకులు తమ సమీప రైతు సేవా కేంద్రంలోకానీ, పశు వైద్య కేంద్రాల్లో కానీ సంప్రదించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా.పి.ప్రేమ్ చంద్, ఉప సంచాలకులు డా.వై.రమేష్ రెడ్డి, సహాయ సంచాలకులు డా.ఎ.రత్నకుమార్, డా.వి.రామచంద్ర రెడ్డి, డా.కే.యల్.శ్రీలక్ష్మి, పశు వైద్యాధికారి డా.ఎ. గోల్డ్ స్మన్ పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలన

**- రూరల్ సీఐ వెంకటరమణ**





**తొండూరు – సూర్య వాస్తవం, డిసెంబర్ 29 :** పులివెందుల నియోజకవర్గం తొండూరు పోలీస్ స్టేషన్‌లో సోమవారం రూరల్ సిఐ వెంకటరమణ తన సిబ్బందితో రికార్డులు పరిశీలించారు. వాటిలో భాగంగా తొండూరు ఎస్సైతో కలిసి రికార్డులు పరిశీలిస్తూ, ఫ్యాక్షన్ గ్రామం ఇనగనూరులో తన సిబ్బందితో కలిసి గస్తీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని, ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని తొండూరు పోలీస్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తొండూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# సెల్‌ఫోన్ ప్రయాణం వద్దు.. ప్రాణాలు ముద్దు

**- ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలు అరికడదాం**

**పులివెందుల– సూర్య వాస్తవం, డిసెంబర్ 29 :** ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్ ప్రమాదాలు అరికడదామని స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు పిలుపునిచ్చారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్రమ్మ ఆధ్వర్యంలో సోమవారం 6వ రోజు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం వాలంటీర్ లచే రోడ్ ప్రమాదాల పై నిర్వహించిన అవగాహనా ర్యాలీని మహాత్మా గాంధీ కూడలి నుండి వారు ప్రారంభించారు. గాంధీ కూడలి నుండి ప్రారంభమైన ర్యాలీ పోలీస్ స్టేషన్, పాత ప్రభుత్వ ఆసుపత్రి మీదుగా పూల అంగల్ల కూడలి వరకు సాగిన ఈ ర్యాలీ లో సెల్ ఫోన్ వద్దు-ప్రణాలు ముద్దు, బైక్ ప్రయాణం లో హెల్మెట్, కారు ప్రయాణాలలో షీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, ట్రాఫిక్ సిగ్నల్‌లు చూసుకుని ట్రాఫిక్ నిబంధనలు పాటించండి రోడ్ ప్రమాదాలు అరికట్టండి అనే నినాదాలతో హెూరెత్తించారు. రోడ్ మార్గంలో ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్ ధరించమని, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదని, ఆటో లలో పరిమితి మించి ప్రయాణికులతో ప్రయాణం ప్రమాదమని, మద్యం తాగిం వాహనాలు నడపరాదని విద్యార్థినిలు అవగాహన కల్పించారు.



## తహసిల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్

**- ఆర్డీవో చిన్నయ్య, తహశీల్దార్ బి.రామచంద్ర**

**తొండూరు – సూర్య వాస్తవం, డిసెంబర్ 29 :** రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆర్డీవో చిన్నయ్య అధికారులకు సూచించారు. సోమవారం తొండూరులోని స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ బి.రామచంద్ర అధ్యక్షతన గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పులివెందుల ఆర్డిఓ చిన్నయ్య సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజలు పలు సమస్యలపై ఆర్డిఓకు వినతులను సమర్పించారు. రైతుల సమస్యల పట్ల అధికారులు తక్షణమే పరిష్కరించా లన్నారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ రామకృష్ణారెడ్డి, మండల సర్వేయర్ రాఘవేంద్ర, ఆర్ఐ నాగరాజు, వీఆర్వో మధుసూదన్, రైతులు పాల్గొన్నారు.

## మదనపల్లి వద్దు.. కడప ముద్దు

**- రాయచోటి ప్రాంతాన్ని కడప జిల్లాలో చేర్చాలి**



**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 29 :** మదనపల్లి వద్దు కడప ముద్దు అని రాయచోటి ప్రాంతాన్ని కడప జిల్లాలో చేర్చాలని మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ఎండి షఫీ నాయక్ జేఏసీ నాయకులు విశ్వనాథ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసిల్దార్ క్రాంతి కుమార్‌కు రాయచోటి ప్రాంతాన్ని కడప జిల్లాకు మార్చాలంటూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా లక్కిరెడ్డిపల్లి తాలూకుగా ఉన్న సమయంలో కూడా కడప జిల్లాలో ఉన్నదని ప్రస్తుతం జిల్లాలు వేరు కావడంతో రాయచోటి ప్రాంతాన్ని మదనపల్లె జిల్లాలో విలీనం చేయకుండా కడప జిల్లాకు మార్చాలని వారు కోరారు. ఎన్నో సంవత్సరాలుగా లక్కిరెడ్డిపల్లి ప్రజలు కడపతో విడదీయరాని అనుబంధం కలిగి ఉన్నారని మదనపల్లి చాలా దూర ప్రాంతము తెలియని ప్రాంతమని 90 కిలోమీటర్లు మదనపల్లికి వెళ్లలేమని కడప జిల్లాలో చేర్చాలని వారు కోరారు. అధికారులు ఎలాగైనా స్పందించి రాయచోటి ప్రాంతాన్ని కడప జిల్లాకు మార్చాలని ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లు పూర్తి





**సింహాద్రిపురం– సూర్య వాస్తవం, డిసెంబర్ 29 :** సింహాద్రిపురం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ముక్కోటి వైకుంఠ ఏకాదశినీ పురస్కరించుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వహకులు తెలిపారు. ఆలయ నిర్వహకులు మాట్లాడుతూ మంగళవారం వేకువజామున 3.30 గంటలకు స్వామివారికి పంచామృత అభిషేక పూజలు అర్చనలు అనంతరం 5 గంటలకు ఆలయంలో వైకుంఠ ఉత్తర ద్వార దర్శనం, కల్పిస్తున్నట్లు తెలిపారు. తర్వాత ప్రసాదం పంపిణీ జరగ నునదన్నారు. సాయింత్రం 4 గం లకు స్వామివారు రథం పై అంగళ్లుబజార్ బైపాస్ రోడ్డు మీదుగా గ్రామోత్సవం జరగ నున్నది. మహిళలచే కోలాటం స్వామి వెంబడి సాగ నున్నదన్నారు. అలాగే మేధా పాఠ శాల విద్యార్థులచే కోలాటం మరియు భరత నాట్య ప్రదర్శనం లు ఉంటాయన్నారు. శ్రీ వేణు గోపాలస్వామి, వీరాంజనేయ స్వామి ఆలయం లో కూడా ముక్కోటి వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వారా దర్శనం 5 గంటలకు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. స్వామి వారికి పంచామృత అభిషేక పూజలు అనంతరం తీర్థ ప్రసాద వినియోగం జరగనుందన్నారు. రాత్రి నంద్యాల పల్లి భజన బృందంచే అఖండ నామ భజన జరగనుందన్నారు. ఈ కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## రెవెన్యూ సమస్యల పరిష్కారానికే!...

# రెవెన్యూ క్లినిక్స్!!...

- ప్రతి అర్జీకి న్యాయబద్ధమైన పరిష్కారం
- భూ వివాదాల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యత
- జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్



**శ్రీ సత్యసాయి బ్యూరో – సూర్య వాస్తవం, డిసెంబరు 29:** శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సంబంధిత సమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం చర్యలు చేపడుతోందని... ఇందులో భాగంగానే రెవెన్యూ క్లినిక్స్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ తెలిపారు.

శ్రీ సత్య సాయి జిల్లాలో సులభంగా వేగవంతంగా రెవిన్యూ సేవలు అందించడమే లక్ష్యంగా భూవివాదాల శాశ్వత పరిష్కారానికి వినూత్న రీతిలో "రెవిన్యూ క్లినిక్స్" కార్యక్రమాన్ని సోమవారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ ప్రారంభించారు. ఇందులో భాగంగా... రెవెన్యూ డివిజన్ వారీగా జిల్లాలోని అన్ని మండలాలలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి నాలుగవ సోమవారం జిల్లా కేంద్రంలో ఈ రెవెన్యూ క్లినిక్స్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మిగతా వారాల్లో ఆయా డివిజన్ స్థాయిలో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు సంతృప్తి స్థాయిలో సేవలు అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి సూచించిన మేరకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు.. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు కూడా ప్రభుత్వం నుంచి అందాయని.. ప్రత్యేకంగా ఈ రెవెన్యూ క్లినిక్స్ కార్యక్రమంలో తాసిల్దార్లు, ఆర్డీవో ఒకే చోట ఉండి, రికార్డులన్నింటిని సిద్ధంగా ఉంచుకొని, ఏదైనా గ్రీవెన్స్ వచ్చినప్పుడు అర్జీదారున్ని కూర్చోబెట్టి సావధానంగా విని డిజైనర్ కార్డులు పరిశీలించాల్సి ఉంటే అక్కడే పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని వివరించారు. సర్వే చేయాల్సి ఉంటే వాటిని కూడా చేయడం జరుగుతుంది. అడంగల్ లో మార్పులు చేర్పులు, మ్యుటేషన్స్, పట్టాదార్ పేరు మార్పులు, అసైన్మెంట్ పట్టా, ఎఫ్లైన్, జాయింట్ ఎల్పీఎం సబ్ డివిజన్, 22 ఏ చుక్కల భూముల సమస్యలు, రస్తా, స్మశాన వాటికల సమస్యలు, అలాగే జిల్లాలోని వివిధ మండలాల నుంచి అందిన భూ వివాదాలు, పట్టాదార్ పాస్ పుస్తకాలు, ఆన్లైన్ రికార్డుల సవరణ, వారసత్వ నమోదు, ఆక్రమణలపై ఫిర్యాదులు తదితర అంశాలను అత్యంత ప్రాధాన్యతతో పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కారం చూపాలనే దిశగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. ప్రతి కౌంటర్లో కూడా ఒక తాసిల్దారు, కలెక్టరేట్ నుంచి సూపరింటెండెంట్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ ను ఏర్పాటు చేయడం జరిగింది. వచ్చిన అర్జీదారుల సమస్యల కు సంబంధించి అర్జీలను కూడా కౌంటర్ లోనే రాస్తారు. మీసేవ ఏపీ సేవలో ఏదైనా డిజిటలైజ్ చేయాల్సి వస్తే ఎన్రోల్ చేయించి నిర్ణీత కాలపరిమితి లోగా పరిష్కరించేందుకు కృషి చేస్తారు. దీనిపై ఏదైనా ఫిర్యాదు అందిన తర్వాత దాని నమోదు నుంచి పరిష్కరించే వరకు తీసుకోవాల్సిన చర్యలపై తాసిల్దార్లకు ఆర్డిఓలకు ప్రతివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు జారీ చేస్తున్నట్లు చెప్పారు. సమస్యకు క్షేత్రస్థాయిలోకి వెళ్లారా లేదా, పరిశీలన చేశారా, ఫిర్యాదు పరిష్కరించిన తర్వాత అర్జీ తారకు ఆ ప్రతిని అందజేశారు అని కూడా పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. తద్వారా మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. అర్జీదారులకు ఏదైనా తెలియక కోర్టుకు వెళ్లాలన్నా కూడా జిల్లా లీగల్ సెల్ వాళ్ళని సంప్రదించి ఇద్దరు ప్యానెల్ సభ్యులను కూడా కేటాయించారు. వారి ద్వారా సివిల్ కోర్టు కేసులను కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. ఏదైనా అడంగల్ లో మార్పులు చేర్పులు చేయాలన్న తాసిల్దార్ స్థాయిలో ఎడిట్ చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అవి కూడా త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తాం. సచివాలయం స్థాయిలో డిజిటల్ అసిస్టెంట్ వెల్ఫేర్ అసిస్టెంట్ ద్వారా కూడా గ్రీవెన్స్ పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. మండల స్థాయి సమస్యలపై ప్రజలు కలెక్టరేట్ కు వస్తే పరిష్కారం అవుతాయి అన్న అపోహను వదలి సమస్యలను స్థానికంగా ఉన్న ఆర్డిఓ, తాసిల్దారు అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

**"మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్"**

మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కూడా మీసేవ ఏపీ సేవల ద్వారా అందించే సర్వీసులు అన్నీ కూడా వాట్స్అప్ ద్వారా ఫోనులోనే పొందవచ్చు. ప్రజల అవగాహన కోసం నేడు 'మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్' కౌంటర్ కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేశాం. దాని ద్వారా కూడా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ప్రభుత్వం ప్రజల పక్షాన నిలబడి, ప్రతి న్యాయమైన సమస్యకు పరిష్కారం అంది స్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అడంగల్ సర్వీస్ ఏ విధంగా పొందాలో కూడా అర్జీదారునికి అతని ఫోన్లో కలెక్టర్ నేరుగా వివరించారు.

**వన్ బి రికార్డు అందజేత**

ఈ సందర్భంగా 20 సంవత్సరాలు నుంచి పరిష్కారం కాకుండా ఉన్న.. భూమి విస్తీర్ణం సమస్య కు అక్కడికక్కడే పరిష్కారం చూపి 1బి రికార్డును సంబంధిత అర్జీదారుకు కలెక్టర్ అందజేశారు.

**వివరాలు:** పుట్టపర్తి మండలం వెంగళం చెరువుకు చెందిన దాసరి నాగలక్ష్మి (70)కు పాసు బుక్కు లేదు. వీరికి సంబంధించిన భూమిలోని 40 సెంట్లు వేరే వారి పేరుపై నమోదు కావడం జరిగింది. విస్తీర్ణ సమస్య వల్ల వీళ్లకు పాస్ పుస్తకం మంజూరు కాలేదు. పలుమార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని లబ్ధిదారు దిగాలు చెందారు. నేడు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం ఉందని తెలుసుకొని.. ఆమె నడవలేని పరిస్థితిలో ఉన్నందున ఆమె కుమారుడు దాసరి శ్రీనివాసులు అర్జీని సమర్పించారు. దీనిపై అప్పటికప్పుడు విచారణ చేసి రికార్డులను పరిశీలించి, వీరి భూమి 40 సెంట్లు నమోదైన ఇతరుల వారితో మాట్లాడి.. వారు అంగీకారంతో 40 సెంట్లు విస్తీర్ణ భూమిని వెబ్ ల్యాండ్ లో నమోదు చేసి... ఆర్ఓఆర్ వన్ బి రికార్డును లబ్ధిదారుకు కలెక్టర్ ద్వారా అందజేశారు. 20 ఏళ్లుగా పరిష్కారం కానీ తమ సమస్యను ఈ ప్రత్యేక కార్యక్రమంలో నేడు పరిష్కరించినందుకు లబ్ధిదారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం మౌర్య భరద్వాజ్, డిఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీఓలు సువర్ణ, మహేష్, వివిఎస్ శర్మ, ఆనందకుమార్, మండల తహశీల్దారులు, వీఆర్వోలు, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## గుంటకల్ -విజయవాడ మధ్య కొత్తగా నడవనున్న ప్యాసింజర్ ట్రైన్లు తుగ్గలిలో ఆపాలి

**- బీజేపీ నాయకులు లక్ష్మన్న, రాంపల్లి రంగయ్య**



**తుగ్గలి – సూర్య వాస్తవం, డిసెంబర్ 29 :** గుంతకల్ బివిజయవాడ మధ్య కొత్తగా నడవబోతున్న ప్యాసింజర్ ట్రైన్లు ను తుగ్గలి రైల్వే స్టేషన్‌లో ఆపాలని బిజెపి పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజలు తహశీల్దారుకు, రైల్వే స్టేషన్ మాస్టర్ కు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మన్న, బిజెపి నాయకులు రాంపల్లి రంగయ్య, టిడిపి నాయకులు బెస్త కృష్ణయ్య లు మాట్లాడుతూ నంద్యాల ఎంపీ బైరెడ్డి శబిర విన్నపం మేరకు రైల్వే అధికారులు నంద్యాల? గుంతకల్ మధ్య పగలుపూట ప్యాసింజర్ ట్రైన్లు తిప్పేందుకు కొత్త ప్యాసింజర్ ట్రైన్లు ఈ మార్గం గుండా త్వరలో నడవనున్నాయని అన్నారు. అయితే ఈ ఈ ప్యాసింజర్ ట్రైన్ లు తుగ్గలి రైల్వే స్టేషన్లో ఆగవని ట్రైన్ షెడ్యూల్లో ఉందన్నారు. తుగ్గలి రైల్వే స్టేషన్ కు 10 కిలోమీటర్ల దగ్గర్లోనే బంగారు ఉత్పత్తి చేసే జొన్నగిరి గోల్డ్ మైన్స్, భారతదేశ చరిత్రలో ప్రసిద్ధిగాంచిన అశోకుని శిలా శాసనాలు, ప్రసిద్ధిగాంచిన పెరవలి రంగనాథ స్వామి ఆలయంలో ఉన్నాయన్నారు. అలాగే తాలూకా హెడ్ క్వార్టర్ పత్తికొండ కూడా ఉందన్నారు. వీటితోపాటు దాదాపు 20 గ్రాముల ప్రజలు తుగ్గలి రైల్వే స్టేషన్ నుండే ఇతర ప్రాంతాలకు వెళుతున్నారని అన్నారు. అంతేగాక గుంతకల్ నంద్యాల మధ్య ఉండే రైల్వే స్టేషన్లో అత్యధికంగా ఆదాయం వచ్చే రైల్వే స్టేషన్ కూడా తుగ్గలి రైల్వే స్టేషన్ అని అన్నారు. అందువల్ల తుగ్గలి రైల్వే స్టేషన్లో కొత్తగా నడవనున్న ప్యాసింజర్ ట్రైన్ల ను ఆపాలని కోరారు. ఈ విషయంపై త్వరలో గుంతకల్ రైల్వే డిఆర్ఎం ను, పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజును, శాసనసభ్యులు కెఈ శ్యామ్ కుమార్ ను కూడా కలిసి వినతి పత్రం అందజేస్తామని తెలిపారు.

## శాంతియుతంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహించాలి

**- భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ పి.జగదీష్**





**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం, డిసెంబర్ 29:** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశముండటంతో జిల్లా ఎస్పీ పి.జగదీష్ సోమవారం నాడు అనంతపురం నగరంలోని పురాతన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానాన్ని సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన భద్రతా మరియు బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆలయ పరిసరాల్లో పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల రాకపోకల సౌకర్యాలు, సీసీటీవీ పర్యవేక్షణ ఎమర్జెన్సీ స్పందన ఏర్పాట్లను సమీక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శాంతియుతంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే మహిళలు, వృద్ధులు, దివ్యాంగ భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయ పరిసరాల్లో విజిబుల్ పోలీసింగ్ పెంచాలని పిక్‌పాకెటింగ్ వంటి నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేపట్టామని ప్రజలు పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఈ సందర్భంగా కోరారు. జిల్లా ఎస్పీ తో పాటు అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, ఒన్ టౌన్ సి.ఐ వెంకటేశ్వర్లు మరియు దేవాదాయశాఖ అధికారులు, తదితరులు వెళ్లారు.

# అసాంఘిక కార్యక్రమాలు
# అక్రమ ఆర్జనలో బీటెక్ రవికి సంతృప్తి


- పెండింగ్ పనులు - ప్రజా సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే అవహేళన సరికాదు
- బీటెక్ రవి వ్యాఖ్యలపై ఎంపీ అవినాష్ రెడ్డి మండిపాటు..




**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 29:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ హయాంలో ఏడాదికాల సుపరి పాలనలో అన్ని అక్రమాలేనని, ఏడాదికాలంగా నిరంతర అసాంఘిక కార్యక్రమాలతో అక్రమంగా దోపిడీ చేయడంలో బీటెక్ రవి సంతృప్తిగా ఉన్నారని, పెండింగ్ ప్రాజెక్టులపై ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తే అవహేళనగా మాట్లాడడం బీటెక్ రవికి సరికాదని ఎంపీ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక జగన్ క్యాంప్ కార్యాలయం నందు ప్రజాప్రతినిధులతో కలిపి జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సమావేశం ఏర్పాటు చేసి బీటెక్ రవి ఇటీవల చేసిన ఏడాదికాల సంతృప్తిపై అవినాష్ రెడ్డి మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందులలో గత సంవత్సర కాలంలో అన్ని రంగాలలో అవినీతి రాజ్యమేలుతోందని, నియోజవర్గ సమస్యలపై మున్సిపల్ ఇంచార్జ్, మున్సిపల్ చైర్మన్ మున్సిపల్ కౌన్సిలర్లు ప్రధానంగా రేషన్ పంపిణీ వ్యవస్థ కొనసాగుతోందని 32 40% అక్రమ రవాణా జరుగుతోందని పాలిసింగ్ ద్వారా రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయని వాటిని పరిష్కరించాలని అదేవిధంగా పులివెందులలో అత్యంత ప్రతిష్టాత్మకంగా పేదల సొంతింటి కలలో భాగంగా అధిక మొత్తంలో ఇంటి నిర్మాణ కార్య క్రమా లు చేపట్టి వాటిని దాదాపు పూర్తి చేసి నిర్మాణ కంపెనీలకు 10 శాతం ఎక్కువ మొత్తాలనే చెల్లించడం జరిగిందని వాటికి సంబంధించి తగు చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందని, పులివెందులలో తాగునీటి అవసరాల కోసం వాటర్ గ్రిడ్డు పథకం ద్వారా ప్రతి ఇంటికి మంచినీరు అందించేందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హయాంలో 480 కోట్ల వ్యయంతో 65 శాతం పనులు పూర్తి చేయడం జరిగిందని వీటన్నింటిని పరిష్కరించే ప్రయత్నం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం చేయకపోగా ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నిస్తే అవహేళన చేయడం తగదని, ఏడాది కాలంలో బీటెక్ రవి సహజ వనరులను దోచుకుంటూ అక్రమ మైనింగ్ అక్రమ ఇసుక మట్కా మరియు జూదం వంటి కార్యక్రమాలతో అక్రమంగా సంపాదించడంలో ఏడాదికాలం సంతృప్తిగా సాగిందని, బీటెక్ పేరులో ఉన్నటువంటి బీటెక్ కు మరియు ఆయన చర్యలన్నీ బోగస్ పనులేనని, నియోజకవర్గానికి సంబంధించి తాగునీటి పనులను ప్రశ్నించే అర్హత టిడిపి నాయకులకు లేదని దివంగత నేత రాజశేఖర్ రెడ్డి హయాంలోనే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా మరియు కృష్ణ జలాలతో గండికోట ను 46వేల క్యూసెక్కుల నుండి 80000 క్యూసెక్కుల నిల్వ కొరకు 1000 కోట్ల రూపాయలతో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ తో జగన్మోహన్ రెడ్డి ప్రయత్నించారని మరియు అదే విధంగా చిత్రావతిలో నాలుగు టీఎంసీల నుండి 8 టీఎంసీల వరకు సామర్థ్యాన్ని పెంచి ఈ ప్రాంత ప్రజల తాగునీటి మరియు తాగునీటి అవసరాలను తీర్చారని, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను తుంగలో తొక్కుతూ మహిళలకు అందించే 18 వేల రూపాయలను, నిరుద్యోగ భృతిని మరియు రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతు భరోసాలను అందించడంలో విఫలమైందని, అన్ని వర్గాల పెన్షన్ల కోతలలో కూటమి ప్రభుత్వం సఫలమై పేద ప్రజలకు సంక్షేమాన్ని దూరం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పులివెందుల పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, రెండవ వైస్ చైర్మన్,హాఫీజ్ లింగాల మండల వైసీపీ నాయకులు బాబు రెడ్డి వేముల మండల వైకాపా నాయకులు నాగేల్ల సాంబశివారెడ్డి , మరియు వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఖాద్రీ ఆలయంలో ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

- ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించిన ఎమ్మెల్యే కందికుంట
- కనీ వినీ ఎరుగని రీతిలో ఖాద్రీ ఆలయంలో ప్రత్యేక అలంకరణ
- లక్షలాదిగా తరలిరానున్న భక్తులు
- నేడు తెల్లవారుజామున 3:30 గంటల నుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం





**కదిరి - సూర్య వాస్తవం, డిసెంబరు 29:** ప్రపంచ ప్రసిద్ధిగాంచిన శ్రీమద్ ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం ముక్కోటి ఏకాదశికి (వైకుంఠ ఏకాదశి)కి ముస్తాబయింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సోమవారం ఆలయ అధికారులు, డి.ఎస్.పి శివన్నారాయణ స్వామి ఇతర పోలీసులు ప్రధాన అర్చకులతో సమావేశమై భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ అధికారులు కూడా పకడ్బందీగా ఏర్పాట్లను చేశారు. పోలీసులు కూడా పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు.ఆలయంలో వివిధ రకాల పూలతో అలంకరించడం విద్యుత్ దీపాలంకరణ భక్తులకు క్యూలైన్లు ఏర్పాటు చేయడం తో పాటు మరిన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారు. మంగళవారం తెల్లవారుజామున మూడున్నర గంటలకు భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించే విధంగా ఆలయ అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు.

ఖాద్రీ ముక్కోటి అంటే శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి (వైకుంఠ ఏకాదశి) సందర్భంగా జరిగే ప్రత్యేక ఉత్సవం. ముక్కోటి ఏకాదశి సందర్భంగా పురాణాల ద్వారా తెలిసిన మేరకు కొంత సమాచారం.. ఈ రోజు శ్రీ మహావిష్ణువు వైకుంఠం నుంచి భూలోకానికి 3 కోట్ల దేవతలతో వస్తారని భక్తుల నమ్మకం, అందుకే ఈ రోజున ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోవడం వల్ల సకల కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం, ఆలయాలన్నీ ప్రత్యేక అలంకరణలతో, భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని క్యూలైన్లతో సిద్ధం చేశారు.నివాసమైన వైకుంఠం నుంచి భూలోకానికి మూడు కోట్ల మంది దేవతలతో కలిసి దిగివస్తారని, ఈ రోజున ఉత్తర ద్వార దర్శనం చేస్తే కోటి ఏకాదశుల పుణ్యం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి, ఈ పవిత్రమైన రోజున భక్తులు ఉపవాస దీక్ష చేసి, ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి, ఉత్తర ద్వారాల ద్వారా స్వామివారిని దర్శించుకుంటారు. వైకుంఠ ఏకాదశి రోజున, విష్ణువు వైకుంఠం నుండి భూలోకానికి మూడు కోట్ల దేవతలతో కలిసి వస్తాడు కాబట్టి దీనికి 'ముక్కోటి ఏకాదశి' అనే పేరు వచ్చింది, ఇది 3 కోట్ల ఏకాదశుల పుణ్యఫలాన్ని ఇస్తుందని నమ్మకం. ఈ రోజున వైకుంఠ ద్వారాలు (ఉత్తర ద్వారాలు) తెరుచుకుంటాయని, వాటి ద్వారా స్వామిని దర్శించడం వల్ల మోక్షం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి, అందుకే దీనిని 'స్వర్గ ద్వార ఏకాదశి' అని కూడా అంటారని పురాణాల ద్వారా తెలుస్తోంది.శ్రీ మహావిష్ణువు తనతో పాటు 3 కోట్ల దేవతలను భూలోకానికి తీసుకువస్తాడని, అందుకే ఈ ఏకాదశిని 'ముక్కోటి ఏకాదశి' అని పిలుస్తారని భక్తుల నమ్మకం. విష్ణువు తనను వ్యతిరేకించిన రాక్షసుల కోసం వైకుంఠ ద్వారాలు తెరిచి, వారి కథ విని, వారిని కూడా వైకుంఠంలో ప్రవేశించేలా చేశాడని ఒక కథనం కూడా ఉంది. ముక్కోటి అనేది ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని భక్తులు అత్యంత శ్రద్ధగా జరుపుకునే ఒక పెద్ద ఆధ్యాత్మిక వేడుక.దీనిలో భక్తులు తమ కోరికల సిద్ధి కోసం స్వామిని దర్శించుకుంటారు.

మహాభారత యుద్ధంలో కృష్ణుడు అర్జునుడికి భగవద్గీతను బోధించిన రోజు కూడా ఇదేనని ఒక కథనం.

దేవతలు, అమృతం పాల సముద్ర మథనంలో అమృతం, హాలాహలం పుట్టిన రోజు కూడా ముక్కోటి ఏకాదశినే అని, ఆ రోజునే శివుడు హాలాహలం మింగాడని కూడా పురాణాలు వివరిస్తున్నాయి.

మీరు అడిగిన "ఖాద్రీ" అనేది కదిరిలోని ప్రసిద్ధ లక్ష్మీనరసింహా స్వామి ఆలయాన్ని సూచిస్తుంది.

ఈ ఆలయంలో ముక్కోటి ఏకాదశి రోజున, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**ప్రతి ఒక్కరికి ఉత్తర ద్వారా దర్శనం కల్పిస్తాం- డీసీ శ్రీనివాస రెడ్డి**

ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి తరలివచ్చే ప్రతి ఒక్క భక్తుడికి ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామని ఖాద్రి ఆలయ డిప్యూటీ కమిషనర్ మరియు కార్య నిర్వహణాధికారి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు ఈ వేడుకకు రాయలసీమ నుంచే కాకుండా కర్ణాటక ప్రాంతం నుంచి లక్షలాది సంఖ్యలో భక్తులు తరలి వస్తారని డీసి పేర్కొన్నారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను పూర్తిస్థాయిలో చేపట్టామని శ్రీనివాసరెడ్డి తెలిపారు.












# స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ఆందోళన చెందొద్దు

**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 29 :** స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ఆందోళన చెందని కమ్యూనిటీ ఆసుపత్రి సూపరెంట్ విష్ణు శివ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేల గడ్డి యందు క్రిములు వల్ల వచ్చే స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అందరిలోనూ ఆందోళన ఉందని దీనికి ఎవరు భయపడకూడదు అన్నారు. స్క్రబ్ టైఫస్ వ్యాధి వికెట్స్ య రికార్ట్స్య బ్యాక్టీరియా సంక్రమణ కలిగి ఉన్న కుట్టిన వ్యక్తి ఈ వ్యాధి వస్తుందని రక్త పరీక్షలు ద్వారా కనుగొన్నారని ఈ వ్యాధి వ్యక్తి నుండి వ్యక్తికి రాదని ప్రాణాంతకమే లేదని ఆయన వివరించారు. ఈ వ్యాధికి వ్యాక్సిన్లు లేవని వ్యాధి నివారణ చర్యలో భాగంగా ఎలుకలు, చుంచు ఎలుకలు పందికొక్కులను నిర్మూలించాలని ఆయన తెలియజేశారు. ఇవి సంచరించే ప్రాంతాలలో గడ్డిపై నిద్రించుట కూర్చుట చేయరాదన్నారు. గడ్డి పైన గమాక్సల్ మలాథియన పిచ్చికారి చేయాలన్నారు. వ్యాధులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జయరామయ్య హెల్త్ సెంటర్ సిబ్బంది రాజేంద్రప్రసాద్ శివకుమార్ శివరంజని దీప్తి ఎమ్ ఎల్ హెచ్ పి లు ఆరోగ్య సిబ్బంది హెచ్ఎం రమేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

# అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షునికి ఘన సన్మానం

**- జనసేన పార్టీ సీనియర్ నేత డా.దాసరి రవిశంకర్**



**వేంపల్లె - సూర్య వాస్తవం, డిసెంబర్ 29 :** తెలుగుదేశం పార్టీ అన్నమయ్య జిల్లా, రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబుని పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నేత డా.దాసరి రవిశంకర్ ఘనంగా సన్మానించారు. ఆ మేరకు ప్రసాద్ బాబుని కలిసి శాలువ కప్పి, జిల్లా అధ్యక్ష పదవిపై శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దాసరి రవిశంకర్ మాట్లాడుతూ రాయలసీమ కాపు సామాజిక వర్గ సీనియర్ నేత రాయచోటి మాజీ ఎమ్మెల్యే, రాజంపేట మాజీ ఎంపీ కీశే. సుగవాసి పాలకొండ్రాయుడు కుమారుడు ప్రసాద్ బాబు మంచి పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల నైతృత్వంలోని కూటమి ప్రభుత్వ పాలనపై అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, అభివృద్ధి, సంక్షేమమే దిశగా కూటమి పాలన కొనసాగుతుందని దాసరి రవిశంకర్ వెల్లడించారు.

# నాలుగో దశ రీ సర్వే ప్రారంభిస్తాం

**- తహశీల్దార్ నాగరాజ్**




**రాయదుర్గం- సూర్య వాస్తవం, డిసెంబరు 29:** రాయదుర్గం మండల పరిధిలోని వేపరాల్ల గ్రామంలో జనవరి రెండవ తేదీ నుండి నాలుగవ దశ రీ సర్వే ప్రారంభిస్తామని తాసిల్దార్ నాగరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రీ సర్వే కు మండల సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారి గ్రామ సర్వేయర్ హాజరవుతారని తహశీల్దార్ పేర్కొన్నారు. అనంతరం వేపరాల గ్రామంలో రెవెన్యూ సిబ్బందితో కలిసి ప్రజలకు రీ సర్వేపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.





# సినిమాలు వదిలేస్తున్నా


## - ప్రకటించిన టివికె అధ్యక్షుడు విజయ్

**చెన్నై :** సినిమాలను వదిలివేస్తున్నట్లు ప్రముఖ నటుడు విజయ్ ప్రకటించారు. ఇటీవలే తమిళగ వెట్రి కజగం (టివికె) పార్టీని స్థాపించి రాజకీయాల్లోకి ప్రవేశించిన సంగతి తెలిసిందే. వచ్చే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. శనివారం కౌలాలంపూర్‌లో నిర్వహించిన 'జన నాయగన్' సినిమా ఆడియో లాంచ్ వేడుకలో అభిమానుల సమక్షంలో ఆయన ఈ ప్రకటన చేశారు. "నాకోసం ఎంతో మంది అభిమానులు థియేటర్‌కి వచ్చి సినిమాలు చూశారు. రానున్న 30 ఏళ్లు వారి కోసం నేను నిలబడతాను. అభిమానులకు సేవ చేసేందుకు సినిమాల నుండి తప్పుకుంటున్నాను" అని ప్రకటించారు.

"సినిమాల్లోకి వచ్చిన మొదటి రోజు నుండి అన్ని రకాల విమర్శలను ఎదుర్కొన్నాను. అది పాత కథ. కానీ నా అభిమానులు మొదటి నుండి నాకు అండగా నిలిచారు. చిన్న ఇల్లు కట్టుకోవాలనుకున్నాను, కానీ నాకు మీరు ఒక ప్యాలెస్‌ను ఇచ్చారు. అందుకే నాకు అండగా నిలిచిన అభిమానుల కోసం వారికి అండగా ఉండాలని నిర్ణయించుకున్నాను. ఈ విజరు కృతజ్ఞతలతో రుణం తీర్చుకుంటాడు" అంటూ భావోద్వేగానికి గురయ్యారు. " జీవితంలో విజయం సాధించాలనుకుంటే.. నీకెప్పుడూ మంచి స్నేహితులే అవసరం ఉండకపోవచ్చు. నీకు బలమైన శత్రువు అవసరం. నీ శత్రువు ఎంత బలంగా ఉంటే నువ్వు అంత స్ట్రాంగ్‌గా ఉంటావ్. నువ్వు చేసేది చిన్న సాయమైనా భవిష్యత్తులో అది ఉపయోగపడుతుంది.

ఎవరినీ ఇబ్బంది పెట్టవద్దు. బాధ పెట్టవద్దు " అని అభిమానులకు సూచించారు. ఈ సందర్భంగా జన నాయగన్' సినిమా బృందంపై ప్రశంసలు కురిపించారు. ఈ కార్యక్రమానికి సుమారు 90,000 మంది హాజరయ్యారు.

# 'పెద్ది'లో జగపతిబాబు ఫస్ట్‌లుక్




రామ్‌చరణ్ 'పెద్ది' మూవీ చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఇటీవల కొన్ని సీన్లను రాజధాని ఢిల్లీలో తెరకెక్కించారు. ఇందుకు సంబంధించిన కొన్ని ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కూడా అవుతున్నాయి. మార్చి 27న థియేటర్లలో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని చిత్ర యూనిట్ ప్రకటించింది. ఈ సినిమాలో నటిస్తున్న జగపతిబాబు ఫస్ట్‌లుక్‌ను చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది. అప్పలసూరి అనే పాత్రలో జగపతిబాబు కనిపించ బోతున్నారు. ఆయనది పాజిటివ్ క్యారెక్టరా? నెగిటివా? అనేది ప్రకటించలేదు. 'పెద్ది' చిత్రాన్ని స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ స్టోరీతో తీస్తున్నారు.

రామ్‌చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్ కీలక పాత్ర చేస్తున్నారు. బుచ్చిబాబు దర్శకుడు. ఎఆర్ రెహమాన్ సంగీతం.






# అదే జోరు...

## - నాలుగో టీ20లోనూ మహిళల ఘన విజయం
## శ్రీలంకపై 4-0 ఆధిక్యం




**తిరువనంతపురం :** శ్రీలంకతో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత మహిళల జైత్రయాత్ర కొనసాగుతోంది. ఆదివారం జరిగిన నాలుగో టీ20లోనూ అమ్మాయిలు ఘన విజయం సాధించారు. 30 పరుగుల తేడాతో శ్రీలంకను చిత్తు చేశారు. ఈ మ్యాచ్‌లో ముందుగా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా అమ్మాయిలు చెలరేగారు. పరుగుల వరద పారించారు. నిర్ణీత 20 ఓవర్లకు 2 వికెట్లు కోల్పోయి 221 పరుగులు సాధించారు. ప్రత్యర్థి శ్రీలంకకు 222 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించారు. టీ20లో భారత మహిళలకిదే అత్యధిక స్కోరు. గతంలో 2024లో వెస్టిండీస్‌పై చేసిన 217/4 స్కోరును ఆదివారం మ్యాచ్‌తో భారత్ అధిగమించింది. ఆదివారం ఓపెనర్లు స్మృతి మంధాన(80బీ 48 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్సులు), షెఫాలీ వర్మ(79బీ 46 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్) యధావిధిగా దంచికొట్టారు. అద్భుత ప్రదర్శనతో హాఫ్ సెంచరీలు నమోదు చేశారు. తృటిలో తమ సెంచరీలను మిస్ చేసుకున్నారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు ఏకంగా 162 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. తరువాత రిచా ఘోష్(40బి), హర్మన్ ప్రీత్ కౌర్(16బి) నాటౌట్‌గా నిలిచారు. వీరిద్దరూ కలిసి 52 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.

శ్రీలంక బౌలర్లలో మాల్షా షెహనీ, నిమిషా మదుషని చెరో వికెట్ తీసుకున్నారు. ఈ తరువాత భారత్ నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని చేధించడానికి బరిలోకి దిగిన శ్రీలంక తన ఇన్నింగ్స్‌ను ధాటినే ఆరంభించింది. తొలి వికెట్‌కు ఓపెనర్లు హసిని పెరీరా (33), చమరి ఆటపట్టు (52) అర్థ సెంచరీ (59 పరుగులు) భాగస్వామ్యం నిర్మించారు. హసీని తరువాత దులాని (29 రనౌట్)తో కలిసి ఆటపట్టు కొద్ది సేపు ఇన్నింగ్స్‌ను తీసుకెళ్లింది. అయితే జట్టు స్కోరు 116 వద్ద రెండో వికెట్‌గా వెనుతిరిగింది. తరువాత మూడో వికెట్‌గా 140 వద్ద దులానీ, నాలుగో వికెట్‌గా 147 పరుగుల వద్ద హర్షిత సమరవిక్రమ (20), ఐదో వికెట్‌గా జట్టు స్కోరు 170 వద్ద కవిషా (13) అవుటయ్యారు. చివరి ఓవర్‌లో విజయం కోసం శ్రీలంక 39 పరుగుల చేయాల్సిన స్థితిలో నిలిచారు. అయితే రష్మిక (5) వికెట్ కోల్పోయి 8పరుగులు మాత్రమే చేసింది. దీంతో 20 ఓవర్లు ముగిసే సరికి శ్రీలంక 6 వికెట్ల నష్టానికి 191 పరుగులు మాత్రమే చేయగలిగింది. నిలక్షిక (23), కౌషిని (5) నాటౌట్‌గా నిలిచారు.



**స్మృతి మంధాన ప్రపంచ రికార్డు**

స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన ఓ కీలక మైలురాయిని అందుకుంది. 10వేల పరుగుల క్లబ్‌లో చేరిన రెండో భారత బ్యాటర్‌గా నిలిచింది. శ్రీలంకతో జరిగిన నాలుగో టీ20లో కీలక మైలురాయిని అందుకుంది. అంతర్జాతీయ మహిళల క్రికెట్ చరిత్రలో 10వేల పరుగులు పూర్తి చేసుకున్న రెండో భారత బ్యాటర్‌గా, ఓవరాల్‌గా నాలుగో బ్యాటర్‌గా రికార్డులోకెక్కింది. అత్యధిక పరుగులు చేసిన మహిళా క్రికెటర్ల జాబితాలో స్మృతి కంటే ముందు.. మిథాలీ రాజ్(10,868) అగ్రస్థానంలో ఉంది. అలాగే న్యూజిలాండ్‌కు చెందిన సుజీ బేట్స్(10,652), ఇంగ్లండ్‌కు చెందిన షార్లెట్(10,273) ఉన్నారు.

## పత్తికొండకు చేరుకున్న అఖిలభారత మహాసభల జీపు జాత




**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 29:** సిఐటియు 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జీపు జాత కార్యక్రమం సోమవారం పత్తికొండకు చేరుకొంది. ఈ సందర్భంగా జీపు జాతకు పత్తికొండ సిఐటియు మండల కార్యదర్శి ఎం రవిచంద్ర ఆధ్వర్యంలో మండల కమిటీ ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్ దగ్గర 18వ సిఐటియు అఖిలభారత మహా సభలను జయప్రదం చేయాలని జీపు జాత కార్యక్రమంలో వచ్చిన నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు దివాకర్, సిఐటియు జిల్లా కార్యదర్శి గోపాల్, సిఐటియు ఆటో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రభాకర్, మాట్లాడుతూ కార్మికుల కర్షకులు పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల పట్ల ఆల్ ఇండియా మహాసభల్లో చర్చించడం జరుగుతుందని ఈ మహాసభలకు కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పత్తికొండ మండల అధ్యక్షులు గోపాల్ మద్దికేర మండలం కార్యదర్శి బురుజుల రాముడు, పత్తికొండ సిఐటియు ఆటో కార్మిక సంఘం అధ్యక్షులు శేఖర్ సివిల్ సప్లై యామాలి యూనియన్ కార్మికులు పెద్ద హుస్సేన్ పరమేష్ ఆటో కార్మికులు హుస్సేన్ ఎన్టీఆర్ తదితరులు పాల్గొన్నారు.

## రబీలో ఫసల్ బీమాపై చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం

**వేంపల్లి -సూర్య వాస్తవం, డిసెంబర్ 29 :** ఈ సంవత్సరం రబీలో ఫసల్ బీమా పై చేతులేత్తేసిన కూటమి ప్రభుత్వం అని వైఎస్ ఆర్సిపి జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి యం.మస్తాన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం విలేకరులతో



మాట్లాడుతూ..జిల్లాలో రబీలో అత్యధికంగా పంటలు సాగు చేస్తారన్నారు. అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోతే రైతులకు ఫసల్ బీమా ధీమాగా ఉంటుందని రైతులు ఆనంద పడేవారు అన్నారు. కానీ డిసెంబర్ 31వ తేదీ వచ్చిన ఇంతవరకు ఆన్లైన్లో కడప జిల్లా చుపియడం లేదు అన్నారు. గతంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం ఉన్నప్పుడు రైతుల మీద భారం పడకుండా ప్రభుత్వమే ఫసల్ భీమా డబ్బులు చెల్లించేది అని తెలిపారు. ఈ ప్రభుత్వము వచ్చాక పాత పద్ధతిలో అ ఏమైనా అమలు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలు ఆన్లైన్లో చూపుతున్నాయి కానీ ఒక్క కడప జిల్లా వచ్చేసరికి కచ్చాసాదింపు చేస్తున్నారు అన్నారు. ఈ సంవత్సరము అధిక వర్షాల వల్ల నువ్వులు, మినుములు,పూర్తిగా డ్యామేజ్ అయింది అన్నారు . చంద్రబాబు నాయుడుకు కడప జిల్లా ఎందుకు అంత రైతులు మీద కచ్చ ప్రసాదం పెట్టి చేస్తున్నారు అర్థం కాలేదని ఆయన అన్నారు. జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రైతుల బాధలు అర్థం కాలేదా వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వానికి రైతులే బుద్ధి చెప్తారన్నారు. కూటమి ప్రభుత్వమ నాయకులూ కళ్ళు తెరిచి జనవరి 30 తేదీ వరకు గడువు పెంచి ఫసల్ బీమా కట్టే విధానంగా చర్యలు చేపట్టాలని వైఎస్ఆర్సిపి రైతుల తరఫున కోరుతున్నామన్నారు.

## 48 గంటల్లో ముద్దాయిని పట్టుకున్న సీఐ వెంకటరమణ బృందం

**- శభాష్ పోలీస్ అంటూ పోలీసులపై ప్రశంశలు కురిపించిన ప్రజలు**

**- పది తులాల బంగారు, కేజీ వెండి రికవరి చేసాం: సిఐ వెంకటరమణ**

**రాయదుర్గం- సూర్య వాస్తవం, డిసెంబర్ 29 :** జిల్లా ఎస్పీ జగదీష్, డీఎస్పీ రవిబాబు ఆదేశాల మేరకు ఇటీవల జరిగిన భారీ చోరీలో రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ బృందం 48 గంటల్లో పది తులాల బంగారు, కేజీ వెండి, దొంగలించిన ముద్దాయి ఆఫ్గాన్ రజాక్ వలిని అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ వెల్లడించారు. కనేకల్ టౌన్ కు చెందిన పెద్ద దేవర తుబుసం వర్త లతీఫ్ ఫిర్యాదు మేరకు కనేకల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కనేకల్ పట్టణానికి లతీఫ్ కుటుంబ సభ్యులతో రెండు రోజులు హైదరాబాద్ నగరానికి వెళ్లారు. లతీఫ్ ఇళ్లకు తాళం వేసి ఉన్న ఇళ్లను గమనించిన ముద్దాయి ఆఫ్గాన్ రజాక్ 10 తులాల బంగారు కేజీ వెండి దొంగలించినట్లు మీడియా సమావేశంలో రూరల్ సీఐ వెంకటరమణ వెల్లడించారు. సీఐ వివరాలు ఇలా ఉన్నాయి... ఫిర్యాదుదారుడు కేసు నమోదు చేసి దర్యాప్తులో ఎస్సై లు నబి రసూల్, నారాయణరెడ్డి, అనంతపురం క్లూస్ టీం డాగ్ స్క్వార్డును రప్పించి నేర స్థలాన్ని సూక్ష్మంగా పరిశీలించి ఆధారాలు సేకరణలో ఫిర్యాదు దారుడు ఇంటి వెనక సైడ్ ఉన్న ఆఫ్గాన్ రజాక్ వలి పై పలు అనుమానాలు పోలీసులు విచారణలో రావడంతో నిందితున్ని పట్టుకొని విచారించగా దొంగతనాన్ని అంగీకరించి దొంగలించిన బంగారు వెండిని పోలీసులకు అప్పగించారన్నారు 48 గంటల్లో సీఐ వెంకటరమణ బృందం చాకచక్యంగా రికోరి చేసి బాధితులకు బంగారాన్ని వెండిని అప్పగిస్తున్నారని శభాష్ పోలీస్ అంటూ పట్టణ ప్రజలు ప్రశంస వరాలు జల్లు కురిపించారు. అనంతరం సీఐ వెంకటరమణ తన బృందాన్ని అభినందించారు.





# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుల్లో సత్వర న్యాయం చేయాలి

**- జిల్లా కలెక్టరు శ్యాం ప్రసాద్**
**- ప్రత్యేక ప్రాధాన్యతతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుల పరిష్కారానికి కృషి**
**- జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్**
**- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ రక్షణ చట్టంపై జిల్లా మానిటరింగ్ కమిటీ సమావేశం**




**శ్రీ సత్య సాయి బ్యూరో - సూర్య వాస్తవం, డిసెంబరు 29:** జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుల్లో బాదితులకు రక్షణ, దోషులకు శిక్షలు, బాధితుల పునరావాసంతో పాటు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో... సాంఘిక సంక్షేమ శాఖ అధ్వర్యంలో జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటి సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. మొదట గత సమావేశపు మినిట్స్ పై తీసుకున్న చర్యలను జిల్లా షెడ్యూల్డ్ కులముల సంక్షేమ మరియు సాధికారత ఇన్చార్జి అధికారి రాజేంద్ర ప్రసాద్ రెడ్డి సభ్యులకు వివరించారు. పిదప గత సమావేశంలో నమోదైన అన్ని కేసుల పురోగతి బాధితుల కేసులలో ఎఫ్.ఐ.ఆర్. నమోదు, దర్యాప్తు, పురోగతి, చార్జిషీటు ఫైలింగ్, కోర్టుల్లో పెండింగ్ కేసులు, సంబంధిత కేసులలో పురోగతిపై కలెక్టర్, జిల్లా ఎస్పీ అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. అనంతరంకలెక్టర్ మాట్లా డుతూ... చట్టాలు, పౌరహక్కుల పట్ల సమాజం లో విస్తృత అవగాహన కల్పించేందుకు పర్యవేక్షక కమిటి సభ్యులు అంకిత భావంతో పాటుపడాలన్నారు. బాధిత కుటుంబాల వారందరికి సెప్టెంబర్ 25 వరకు పెండింగ్ ఉన్న అందరికి పరిహారాలు అందించడం జరిగిందని తెలిపారు. పౌర హక్కుల చట్టాన్ని, ఎస్సి, ఎస్టీల పట్ల వివక్ష, హింస, అవమానాలు, ఓదార్పు అమలు లోనికి తేవడం జరిగిందని, చట్ట ఉనికిని కాపాడేందుకు కమిటి సభ్యులు సమం ర్థవంతంగా పనిచేయాలన్నారు. ప్రతినెల 30న తేదిన ప్రతి మండలం లోని ఒక గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని తప్పకుండా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని, చట్టాలపై అవగాహన కల్పిస్తూ కేసుల నమోదును ఇంకా తగ్గించాలని రెవెన్యూ డివిజన్ అధికార్లను ఆదేశించారు.

సమావేశంలో ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా మొత్తం 76 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులున్నాయి. ఇందులో 2020, 2021, 2022 లో రెండు కేసుల చొప్పున కోర్టు స్టే వల్ల పెండింగ్ ఉన్నాయని, మిగిలిన వాటిలో 49 కేసులు కోర్టులో సీసీ నెంబరు రావాల్సి ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుల్లో బాధితులకు న్యాయం చేయడానికి వెంటనే ఎస్ఐఆర్ నమోదు చేసి, కేసుల దర్యాప్తు పూర్తి చేసి, నిర్దేశించిన సమయంలోపు చార్జిషీటును దాఖలు చేయాలన్నారు. బాధితులకు నష్ట పరిహారం అందించి కేసులు నమోదైన వారికి శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. జిల్లాలోని పలు ప్రాంతాలలో స్మశాన వాటిక ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, హత్యకు గురైన సంబంధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని, అన్యాయంగా ఎస్సీ ,ఎస్టీ భూములు ఆక్రమించుకున్న, అలాగే హక్కులు కలిగిన భూములపై ఇతరులు పట్టాలు పొందడం తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారుల నేతృత్వంలో బాధితులకు న్యాయం కల్పించేందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ... ఎస్సీ ఎస్టీల అట్రాసిటీ కేసులపై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతస్తోందని, వాటి పరిష్కారానికి అధి కారులు కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా కృషి చేయాలని కోరారు. పరిహారం అందాల్సిన కేసులను కూడా బాధితులను దళిత గత న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు మార్య భరద్వాజ్, పుట్టపర్తి, ధర్మవరం, పెనుకొండ, కదిరి రెవిన్యూ డివిజనల్ అధికారులు సువర్ణ, మహేష్, ఆనంద్ కుమార్, వివిఎస్ శర్మ, ఎస్డిపిఓలు, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటి సభ్యులు సి.గంగులయ్య, శ్రీనివాస నాయక్, కె. వీర నారాయణ, ఎం.కిష్ణమూర్తి, డి.ఉమా శంకర్, సి. రామాంజినప్ప, కె.ఎన్. నరసయ్య, ఆర్.కిష్టానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సిలంబం పోటీల్లో మాస్టర్స్ టైక్వాండో క్లబ్ క్రీడాకారుల ప్రభంజనం

**- సిలంబం కర్ర ఫైట్‌లో ప్రథమ స్థానం జాతీయ స్థాయికి ఎంపిక**
**- కోచ్ ఉయ్యాల పవన్ కుమార్‌కు పలువురి అభినందనలు**



**నాయుడుపేట- సూర్య వాస్తవం, డిసెంబర్ 29:** నెల్లూరులోని సోమిశెట్టివారి కల్యాణ మండపంలో నిన్న (డిసెంబర్ 28న) సిలంబం అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సిలంబం (కర్రసాము) పోటీలు-2025లో నాయుడుపేట పట్టణానికి చెందిన మాస్టర్స్ టైక్వాండో క్లబ్ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ తనిఖీ వేలు మరియు సెక్రటరీ డాక్టర్ ధనుష్ పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 200 మందికి పైగా హాజరుకాగా, నాయుడుపేట నుండి మాస్టర్స్ టైక్వాండో క్లబ్ తరపున 15 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. క్లబ్ ఫౌండర్ మాస్టర్ ఉయ్యాల పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారిలో నలుగురు క్రీడాకారులు సిలంబం కర్ర ఫైట్‌లో ప్రథమ స్థానం సాధించగా, ముగ్గురు ద్వితీయ స్థానాన్ని, ఎనిమిది మంది తృతీయ స్థానాన్ని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ తనిఖీ వేలు మాట్లాడుతూ, ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారులను ఫిబ్రవరి మొదటి వారంలో తమిళనాడులోని కోయంబత్తూరులో నిర్వహించనున్న జాతీయ స్థాయి సిలంబం పోటీలకు పంపించడం జరుగుతుందని అధికారికంగా ప్రకటించారు. విజేతలకు సెక్రటరీ డాక్టర్ ధనుష్ చేతుల మీదుగా ట్రోఫీలు అందజేశారు. నాయుడుపేట కీర్తిని రాష్ట్ర స్థాయిలో చాటిన క్రీడాకారులను, వారిని తీర్చిదిద్దిన కోచ్‌లు ఉయ్యాల పవన్ కుమార్ మరియు ఎస్.కె. అష్రఫ్‌లను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

## పోలీస్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 70 వినతులు

**- వినతులను విచారించి చట్ట పరిధిలో పరిష్కారం చూపండి**

**- జిల్లా ఎస్పీ పి.జగదీష్**






**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 29:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ప్రతీ పిటీషన్ ను చట్ట పరిధిలో విచారించి పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన నాణ్యతగా పరిష్కారం చూపాలనే రాష్ట్ర ప్రభుత్వం సంకల్పం మేరకు జిల్లా ఎస్పీ సోమవారం నాడు స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్ ( ప్రజా సమస్యల పరిష్కార వేదిక ) కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలమూలల నుండీ వచ్చిన ప్రజల నుండీ ఎస్పీ 70 ఫిర్యాదులు స్వీకరించారు. పిటీషనర్లతో ముఖాముఖి మాట్లాడారు. లోతుగా వారి సమస్యలను విని అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భార్యాభర్తల గొడవలు, కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు, తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఈకార్యక్రమంలో అశ్విని మణిదీప్, అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎనిమిదో హిందూ సమ్మేళనం

**- భారీ బైక్ ర్యాలీతో వెల్లివిరిసిన హిందూ ఐక్యత**

**వేముల - సూర్య వాస్తవం, డిసెంబరు 29:** హిందూ ఐక్యతను చాటుతూ వేముల మండల కేంద్రంలో ఎనిమిదో హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల నుంచి హిందూ ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. హిందూ సమ్మేళనంలో భాగంగా స్థానిక టీడీపీ మండల సీనియర్ నాయకుడు పేర్ల శేషారెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సుమారు 300కు పైగా మోటార్ బైకులతో చేపట్టిన ఈ ర్యాలీ వేముల మండల కేంద్రం గుండా సాగి ప్రజలను ఆకట్టుకుంది. బైక్ ర్యాలీలో పాల్గొన్న యువత, గ్రామస్తులు హిందూ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే నినాదాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా హిందూ సమాజంలో ఐక్యత, సాంస్కృతిక విలువలు మరింత బలోపేతమవుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేముల మండలంలోని పలు గ్రామాల ప్రజలు, యువకులు, హిందూ సంఘాల ప్రతినిధులు విశేషంగా పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )